RNI No. APTEL/2009/28868

# సిటిజన్ టైమ్స్

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

తెలుగు దినపత్రిక

CITIZEN TIMES TELUGU DAILY



సంపుటి :18 | సంచిక : 282 | సంపాదకులు : కంచర్ల సందీప్ కుమార్ | ప్రచురణ : విశాఖపట్నం | 18-8- 2026 | పేజీలు : 8 | వెల : 2/- రూ ॥

VOLUME: 18 | ISSUE : 282 | EDITOR:KANCHERLA SANDEEP KUMAR | PUBLISHED: VISAKHAPATNAM | 18-8-2026 | PAGES: 8 | PRICE : 2/- RS

## నాగబాబుకు కేబినెట్ హోదాతో పదవి..

చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపిన పవన్ కల్యాణ్

నాగబాబుకు ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ పదవి

కేబినెట్ హోదాతో నియామకం చేపట్టిన ప్రభుత్వం

రాష్ట్రంలో 50 శాతం పచ్చదనం సాధించడమే లక్ష్యం

సోదరుడి నియామకంపై

హర్షం వ్యక్తం చేసిన డిప్యూటీ సీఎం పవన్



**అమరావతి, సిటిజన్ టైమ్స్**

జనసేన సీనియర్ నేత, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో కీలక పదవి లభించింది. ఆయనకు కేబినెట్ హోదా కల్పిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక తరువాయి 2లో..

### డీఎస్సీ నియామకాల్లో డీవియేషన్ లేదు.. దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలి

## వైసీపీకి చంద్రబాబు సవాల్

మెగా డీఎస్సీ నియామకాల్లో

అంతా పారదర్శకమేనన్న

సీఎం చంద్రబాబు

అసెంబ్లీలో సుదీర్ఘ ప్రసంగం

డీఎస్సీపై వైసీపీది

హిట్ అండ్ రన్ తరహా

దుష్ప్రచారం అంటూ ఫైర్

దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి

చర్చించాలని ప్రతిపక్షానికి సవాల్

148 రోజుల్లో 15,941

ఉద్యోగాలను పారదర్శకంగా

భర్తీ చేశామని వెల్లడి

అసెంబ్లీకి రాకుండా

బయట పబ్జీలు

ఆడుకుంటున్నారని విమర్శ



**అమరావతి, సిటిజన్ టైమ్స్**

మెగా డీఎస్సీ నియామకాల్లో ఒక్క డీవియేషన్ కూడా జరగలేదని, ప్రతిభ ఆధారంగానే అత్యంత పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ అంశంపై వైసీపీ చేస్తున్నది కేవలం హిట్ అండ్ రన్ ఆరోపణలేనని, వారికి దమ్ము, ధైర్యం ఉంటే శాసనసభకు వచ్చి చర్చించాలని ఆయన సవాల్ విసిరారు. ఒడిశా కూలీలతో, 90 ఏళ్ల జగన్ జెన్ జీ వృద్ధులతో ఫేక్ ప్రదర్శనలు చేయిస్తూ డీఎస్సీపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన తరువాయి 2లో..

## ఆదాయానికి మించిన ఆస్తుల కేసు.. రాహుల్ గాంధీకి ఊరట



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ఊరట లభించింది. ఈ కేసులో నివేదికను అలహాబాద్ హైకోర్టులో సమర్పించొద్దని ఈడీ, సీబీఐలకు తరువాయి 2లో..

## ఇరాన్‌పై అణుదాడికి అమెరికా చర్చలు

అమెరికా కాంగ్రెస్ మాజీ సభ్యురాలు



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

అమెరికా కాంగ్రెస్ మాజీ సభ్యురాలు, రిపబ్లికన్ పార్టీ నాయకురాలు మర్జోరీ టేలర్ గ్రీన్ సంచలన వ్యాఖ్యలు తరువాయి 2లో..

## స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే భారీ కుట్ర భగ్నం: అమిత్ షా



ఐఎస్ఐ అండతో పనిచేస్తున్న షాజాద్ భట్టి ఉగ్ర నెట్‌వర్క్‌ను ధ్వంసం చేశామన్న అమిత్ షా

స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే దాడుల కుట్రను భగ్నం చేశామన్న అమిత్ షా

14 రాష్ట్రాల్లో విస్తృతంగా ఆపరేషన్లు.. 200 మందికి పైగా అరెస్ట్

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

పాకిస్థాన్ ఐఎస్ఐ మద్దతుతో కార్యకలాపాలు సాగిస్తున్న 'షాజాద్ భట్టి నెట్‌వర్క్' అనే ఉగ్రవాద ముఠాను పూర్తిగా నిర్మూలించినట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారం ప్రకటించారు. స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే దేశంలో విధ్వంసక దాడులు చేసేందుకు పన్నిన భారీ కుట్రను భద్రతా బలగాలు భగ్నం చేశాయని, ఈ క్రమంలో 14 రాష్ట్రాల్లో 200 మందికి పైగా నిందితులను అరెస్ట్ చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ మేరకు అమిత్ షా సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా వివరాలను వెల్లడించారు. భద్రతా బలగాలు సమన్వయంతో చేపట్టిన ఆపరేషన్ల ద్వారా ఈ నెట్‌వర్క్‌ను తరువాయి 2లో..

### 148 రోజుల్లోనే డీఎస్సీ ప్రక్రియ పూర్తి..

## ప్రతి ఏటా డీఎస్సీ నిర్వహిస్తాం

ఏపీ అసెంబ్లీలో మంత్రి నారా లోకేశ్

డీఎస్సీ పరీక్షను ఎంతో బాధ్యతాయుతంగా

నిర్వహించామన్న లోకేశ్

విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు విప్లవాత్మక

మార్పులు తెచ్చామని వెల్లడి

వైసీపీ ప్రభుత్వం ఉపాధ్యాయులకు మద్యం

దుకాణాల వద్ద నిలబెట్టిందని మండిపాటు



**అమరావతి, సిటిజన్ టైమ్స్**

ఆంధ్రప్రదేశ్ శాసనసభ వర్షాకాల సమావేశాలు తరువాయి 2లో..

### ఏపీ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం..

## గైర్హాజరైన జగన్, వైసీపీ ఎమ్మెల్యేలు

సభ ప్రారంభమైన వెంటనే ప్రశ్నోత్తరాలను

చేపట్టిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు

అమరావతి నిర్మాణ పనులపై వివరాలను

వెల్లడించిన మంత్రి నారాయణ

30,173 మంది రైతులకు

రిటర్నబుల్ ఫ్లాట్స్ కేటాయించామని వెల్లడి



**అమరావతి, సిటిజన్ టైమ్స్**

ఆంధ్రప్రదేశ్ శాసనసభ వర్షాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సమావేశాలకు వైసీపీ జగన్ సహా వైసీపీ ఎమ్మెల్యేలు తరువాయి 2లో..

### భాజపా జాతీయ ఉపాధ్యక్షురాలిగా పురందేశ్వరి..

## కాషాయ దళం కొత్త టీమ్ ఇదే




**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

భాజపా నూతన జాతీయ కార్యవర్గాన్ని ప్రకటించింది. 13 మంది జాతీయ ఉపాధ్యక్షులతో పాటు వివిధ కీలక పదవులకు ఎంపిక చేసిన వారి జాబితాలను విడుదల చేసింది. భాజపా జాతీయ ఉపాధ్యక్షుల జాబితాలో కేంద్ర మాజీ మంత్రి, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి (ఆంధ్రప్రదేశ్), మాజీ సీఎం వసుంధర రాజే సింధియా(రాజస్థాన్)తో పాటు తీరథ్ సింగ్ రావత్ (ఉత్తరాఖండ్), రామ్ మాధవ్ (ఢిల్లీ), బైజయంత్ జయ్ పాండా (ఒడిశా), రేఖా వర్మ, వర్షాబెన్ నరేంద్రభాయ్ దోషీ (గుజరాత్), డాక్టర్ భారతీ ప్రవీణ్ పవార్ (మహారాష్ట్ర), సర్దార్ మన్‌ప్రీత్ సింగ్‌బాదల్ (పంజాబ్), లాల్ సింగ్ ఆర్య (మధ్యప్రదేశ్), ప్రొఫెసర్ ఎం.నాగరాజ (కర్ణాటక), ప్రొఫెసర్ తారిఖ్ మన్సూర్ (ఉత్తర్‌ప్రదేశ్), డాక్టర్ మధు చంద్ర కర్ (పశ్చిమబెంగాల్) తరువాయి 2లో..

## 'దిమాగీ నక్సల్ పార్టీ'.. ఒక్క రోజులోనే 1.6 లక్షల ఫాలోవర్లు!

'దిమాగీ నక్సల్ పార్టీ' పేరుతో కొత్త ఇన్‌స్టాగ్రామ్ ఖాతా

24 గంటల్లోనే 1.6 లక్షలకు పైగా ఫాలోవర్లు -ఖాతాలో ప్రస్తుతం 62 పోస్టులు

ఖాతాను ఎవరు నిర్వహిస్తున్నారో లేని స్పష్టత -ఈ నెలలోనే ప్రారంభమైన అకౌంట్



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

ప్రధాని నరేంద్ర మోదీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రస్తావించిన 'దిమాగీ నక్సల్' పదం ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. ఇదే పేరుతో ఓ కొత్త ఇన్‌స్టాగ్రామ్ ఖాతా వెలుగులోకి వచ్చింది. ఖాతా ప్రారంభించిన 24 గంటల్లోనే 1.6 లక్షలకు పైగా ఫాలోవర్లు చేరడం ఆసక్తికరంగా మారింది. 'దిమాగీ నక్సల్ పార్టీ' పేరుతో ఉన్న ఈ ఖాతాలో 62 పోస్టులు ఉన్నాయి. దాదాపు 35 ఖాతాలను ఫాలో అవుతోంది. ఇన్‌స్టాగ్రామ్‌లోని వివరాల ప్రకారం తరువాయి 2లో..

## ఎడిటోరియల్

# ప్రత్యక్ష ఎన్నికలు... టీడీపీ వర్సెస్ వైసీపీగానే !

ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైంది. కూటమి ప్రభుత్వం సాధ్యమైనంత త్వరగానే ఎన్నికల ప్రక్రియ నిర్వహించాలని చూస్తోంది. ఇదే క్రమంలో ఈసారి ఎన్నికల విధానంలో కీలక మార్పులను తీసుకుని రావాలని భావిస్తోంది. అందులో భాగమే డైరెక్ట్ ఎన్నికలు. అంటే కార్పోరేషన్లలో మేయర్ పదవికి, మునిసిపాలిటీస్ లో చైర్మనలు జెడ్పీ ఎంపీపీ చైర్మన్లకు నేరుగా ఎన్నికలు జరుగుతాయి అన్న మాట. ప్రజలు నేరుగా తమ ఓటు వేసి వారిని ఎన్నుకుంటారు. దీని వల్ల ఎవరు మేయర్ గా ఉండాలి, ఎవరు జిల్లా పరిషత్తు చైర్మన్ గా ఉండాలి అన్నది ప్రజల చేతిలోనే ఉంటుంది అన్న మాట. నిజానికి ఇది మంచి విధానమే. టీడీపీ గతంలో దీనినే అమలు చేస్తూ వచ్చింది. అయితే కాంగ్రెస్ హయాంలో పరోక్ష ఎన్నికల విధానం తీసుకుని వచ్చారు. దీని వల్ల పదవులు అన్నీ అధికారంలో ఉన్న వారే దక్కించుకుని వీలు కలుగుతుంది. అయితే ఇపుడు టీడీపీ కూటమి ఈ విధానానికి బ్రేకులు వేస్తూ డైరెక్ట్ ఎలక్షన్స్ కి పట్టం కడుతోంది. దీని వల్ల తమ పార్టీకి విజయావకాశాలు ఎక్కువగా ఉంటాయని నమ్ముతోంది. అంతే కాదు అవిశ్వాసాలు తరచూ బెదిరింపులు స్థానిక సంస్థలలో అస్థిర రాజకీయాలు క్యాంప్ పాలిటిక్స్ వంటివి ఉండకుండా చెక్ పెట్టొచ్చు అని కూడా భావిస్తోంది. దీని వల్ల కూటమికే ఎక్కువ చాన్స్ అని ఆ పార్టీ పెద్దలు అయితే అంచనా వేస్తున్నారు. అయితే నేతలు మాత్రం ఇది కొంత ఇబ్బందికరమైనదిగా అంటున్నారు. ఎలా అంటే మేయర్ జెడ్పీ చైర్మన్ వంటి కీలకమైన పదవులకు నేరుగా ఎన్నికలు పెడితే విపక్ష వైసీపీ కూడా రేసులోకి దూసుకుని వస్తుందని అంటున్నారు అంతే కాదు వార్డులలో ఎంత మంది నెగ్గారు అన్న దానితో సంబంధం లేదని దాంతో వార్డు పదవులకు పోటీ చేసే వారు కూడా డీలా పడుతారు అని అంటున్నారు. అలాగే మేయర్ జెడ్పీ చైర్మన్ అభ్యర్థులు ముందుగా తెలిసిపోవడం వల్ల మిగిలిన వారు ఆశావహులు వారికి ఏ మేరకు సహకరిస్తారు అన్న చర్చ కూడా సాగుతోంది. అసలే మూడు పార్టీలు ఉన్న కూటమిలో గ్రౌండ్ లెవెల్ లో ఎన్నో రకాలైన సమస్యలు ఉంటాయి కదా అని గుర్తు చేస్తున్నారు. ఇదిలా ఉంటే గ్రౌండ్ లెవెల్ లో సంస్థాగతంగా పట్టున్న పార్టీలు టీడీపీ వైసీపీ మాత్రమే. ఈ విధంగా డైరెక్ట్ ఎన్నికలు పెడితే కనుక వైసీపీ నుంచి పోటీకి సిద్ధపడిన వారు ఎక్కువ మందే ఉంటారు అని అంటున్నారు. ఒకవేళ పరోక్ష పద్ధతి అయితే వైసీపీ గెలుపు ఖాతాను రాసే చాన్స్ చాలా తక్కువ అని అంటున్నారు. ముందుగా వార్డు మెంబర్లను గెలిపించుకోవాలి, ఆ మీదట క్యాంప్ పాలిటిక్స్ చేయాలి, అధికార పార్టీ నుంచి అన్ని విధంగా తట్టుకుని నిలబడాలి, ఇన్ని చేసినా అధికార పార్టీకి ఉండే ఎక్స్ అఫీషియో సభ్యుల మద్దతుతో వారికే గెలుపునకు ఎక్కువ చాన్స్ ఉంటుందని మొదట్లోనే కాడె వదిలేసే వారు అని అంటున్నారు. ఇపుడు డైరెక్ట్ ఎన్నికలు అంటే కాస్తా ఆర్థిక బలం ఉన్న వారు అంతా వైసీపీ నుంచి మేయర్ జెడ్పీ చైర్మన్లకు పోటీ చేసేందుకు ఉత్సాహం చూపిస్తారు అని అంటున్నారు. ఇక కూటమిలో చూసుకుంటే మిత్రుల మధ్య కో ఆర్డినేషన్ సహకారం వంటి వాటి విషయంలో అనుమానాలు కూడా ఉన్నాయని అంటున్నారు. అయితే గ్రౌండ్ లెవెల్ లో ఉన్న బలం చూసుకునే టీడీపీ డైరెక్ట్ ఎన్నికలకు తెర తీసింది అని అంటున్నారు. అదే సమయంలో వైసీపీ కూడా రంగంలోకి దిగేందుకు ఈ విధానం ఉపకరిస్తుందని అంటున్నారు. అలా చూసుకుంటే కనుక ఈసారి పోటీ అంతా టీడీపీ వర్సెస్ వైసీపీగానే ఉండబోతోంది అని అంటున్నారు.

## 'దిమాగీ నక్సల్ పార్టీ'.. ఒక్క రోజులోనే 1.6 లక్షల ఫాలోవర్లు!

ఈ నెలలోనే ఖాతా తెరిచారు. ఇప్పటివరకు ఒకసారి యూజర్ నేమ్‌ను మార్చినట్లు సమాచారం ఉంది. అయితే ఈ ఖాతాను ఎవరు నిర్వహిస్తున్నారనే వివరాలు మాత్రం వెల్లడికాలేదు. ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని మోదీ 'దిమాగీ నక్సల్' అనే పదాన్ని ఉపయోగించారు. మావోయిస్టులపై పోరులో సాధించిన విజయాలను ప్రస్తావించిన ఆయన.. అడవుల్లో సాయుధ నక్సలిజాన్ని అణిచివేయగలిగామని చెప్పారు. అయితే సాయుధ నక్సల్స్ తగ్గిపోయినా.. 'దిమాగీ నక్సల్స్' ఇంకా ఉన్నారని వ్యాఖ్యానించారు. మోదీ చేసిన ఈ వ్యాఖ్యల తర్వాత అదే పేరుతో ఇన్‌స్టాగ్రామ్ ఖాతా వెలుగులోకి రావడం ఇప్పుడు సోషల్ మీడియాలో ఆసక్తి రేపుతోంది. అయితే ఖాతా వెనుక ఎవరున్నారు? దాని ఉద్దేశం ఏంటి? అనే విషయాలు మాత్రం స్పష్టంగా తెలియలేదు.

### డీఎస్సీ నియామకాల్లో డీవియేషన్ లేదు.. దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలి

# వైసీపీకి చంద్రబాబు సవాల్

తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇవాళ శాసనసభలో మెగా డీఎస్సీ నియామకాలపై జరిగిన చర్చలో సీఎం సుదీర్ఘంగా మాట్లాడారు.

**విద్యాభివృద్ధికి టీడీపీ కట్టుబడి ఉంది**

విద్యార్థులకు మంచి విద్య, నైపుణ్యాలు అందిస్తే వారే అత్యుత్తమ మానవ వనరులుగా తయారవుతారని తమ ప్రభుత్వం విశ్వసిస్తుందని చంద్రబాబు అన్నారు. ఎన్టీఆర్ హయాంలో రెసిడెన్షియల్ పాఠశాలలు, మహిళా యూనివర్సిటీ ఏర్పాటుతో విద్యా సంస్కరణలకు శ్రీకారం చుట్టామని గుర్తుచేశారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రతి కిలోమీటరుకు ఓ ప్రాథమిక పాఠశాల, మండలానికి ఓ జూనియర్ కాలేజీ, జిల్లాకు ఓ మెడికల్ కాలేజీ ఏర్పాటు చేశామని తెలిపారు. 2019-24 మధ్య ఐదేళ్లలో ఒక్క ఉపాధ్యాయ పోస్టును కూడా భర్తీ చేయని పాలకులు, విద్యారంగంపై డబ్బాలు కొట్టుకున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటివరకు 14 డీఎస్సీలు జరిగితే, వాటిలో 11 డీఎస్సీలను టీడీపీ, ఎన్డీయే ప్రభుత్వాల హయాంలోనే నిర్వహించి, అవినీతికి ఆస్కారం లేకుండా నియామకాలు చేపట్టామని వివరించారు.

**148 రోజుల్లోనే పారదర్శకంగా నియామకాలు**

గత పాలకులు ఐదేళ్లలో చేయలేని పనిని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే తొలి సంతకంతో చేసి చూపించామని చంద్రబాబు అన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 15,941 ఉద్యోగాలను కేవలం 148 రోజుల్లోనే పారదర్శకంగా భర్తీ చేశామని వివరించారు. టెట్, డీఎస్సీ నోటిఫికేషన్ల నుంచి హారిజాంటల్, వర్టికల్ రిజర్వేషన్ల ప్రక్రియ వరకు అన్నీ కట్టుదిట్టంగా చేపట్టామన్నారు. 13 సబ్జెక్టులకు 42 వేల ప్రశ్నలను ఎంపిక చేసి, 154 కేంద్రాల్లో కంప్యూటర్ ఆధారిత (సీబీటీ) విధానంలో పరీక్షలు నిర్వహించి, ఫలితాలను కూడా పారదర్శకంగా విడుదల చేశామని తెలిపారు. మెరిట్ కమ్ రోస్టర్ విధానంలోనే పూర్తి ప్రతిభ ప్రకారం 15,941 మందిని ఎంపిక చేశామని, నియామక ప్రక్రియ వివరాలన్నీ ఆన్‌లైన్‌లో ఉన్నాయని, ఇంతకంటే పారదర్శకత ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు. ఫిర్యాదుల పరిష్కారానికి జోనల్, రాష్ట్రస్థాయి కమిటీలతో పాటు అప్పీలేట్ అథారిటీని కూడా ఏర్పాటు చేశామన్నారు.

**వైసీపీవి ఫేక్ ఆందోళనలు, కుట్రలు**

డీఎస్సీపై వైసీపీ నిరాధార ఆరోపణలు చేస్తోందని సీఎం ధ్వజమెత్తారు. "గొడ్డలి పార్టీ నేతలు ఒడిశా కూలీలతో, 90 ఏళ్ల జగన్ జెన్‌జీ వ్యక్తులతో ఫేక్ ధర్నాలు చేయిస్తున్నారు. ప్రభుత్వంలో పనిచేసి రిటైరైన ఓ ఐఏఎస్ అధికారి, ఓ మాజీ మంత్రి ఇష్టానుసారం మాట్లాడుతున్నారు" అని విమర్శించారు. వైసీపీ ఆరోపణలను సహించలేకే డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన టీచర్లే స్వయంగా రోడ్లపైకి వస్తున్నారని, మొన్న కర్నూలులో, నిన్న విజయవాడలో భారీగా ఆందోళనలు చేశారని గుర్తుచేశారు. "పిల్లలకు పాఠాలు చెబుతాం.. మా ప్రతిభను కించపరిస్తే గుణపాఠం కూడా చెబుతాం" అని వారు నినదించిన విషయాన్ని చంద్రబాబు సభ దృష్టికి తెచ్చారు.

**అసెంబ్లీకి రాకుండా పబ్జీలా?**

తమ ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీ అని, కుట్రలు చేసే పార్టీలకు కాదని చంద్రబాబు తేల్చిచెప్పారు. "ధైర్యం ఉంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలి. అడ్డంగా దొరికిపోతామనే భయంతో వారు సభకు రావడం లేదు. సిగ్గులేని ఆ పార్టీ సభ్యులు అసెంబ్లీకి రాకుండా బయట పబ్జీలు ఆడుకుంటున్నారు. రెండున్నరేళ్లుగా సభకు రాకుండానే జీతాలు, ప్రివిలేజెస్ తీసుకుంటున్నారు. నా జీవితంలో ఇలాంటి పార్టీని చూడలేదు" అని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తనకు ప్రజల పట్ల పూర్తి బాధ్యత ఉందని, రాష్ట్రంలో ఎలాంటి కుట్రలు పనిచేయవని, ఉపాధ్యాయ నియామకాలు అత్యంత జవాబుదారీతనంతో జరిగాయని సీఎం పునరుద్ఘాటించారు.

### 148 రోజుల్లోనే డీఎస్సీ ప్రక్రియ పూర్తి..

# ప్రతి ఏటా డీఎస్సీ నిర్వహిస్తాం

ఈరోజు ప్రారంభమయ్యాయి. సభలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ... డీఎస్సీ నిర్వహణ, విద్యావ్యవస్థలో చేపట్టిన సంస్కరణలపై కీలక వివరాలు వెల్లడించారు. డీఎస్సీ పరీక్ష ప్రక్రియను ప్రభుత్వం ఎంతో బాధ్యతాయుతంగా నిర్వహించిందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి కట్టుబడి ఏకంగా 148 రోజుల్లోనే నియామక ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశామని సభకు తెలియజేశారు. రాబోయే రోజుల్లో కూడా ప్రతి ఏటా క్రమం తప్పకుండా డీఎస్సీ నిర్వహిస్తామని ఆయన స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చామని లోకేశ్ వివరించారు. ఉపాధ్యాయుల నియామకాలు, బదిలీలను అత్యంత పారదర్శకంగా తెలిపారు. ఉపాధ్యాయులకు అంతర్జాతీయ స్థాయి శిక్షణ అందించేందుకు సింగపూర్, ఫిన్‌లాండ్ వంటి దేశాలకు పంపిస్తుంటే, గత వైసీపీ ప్రభుత్వం ఉపాధ్యాయులను మద్యం దుకాణాల వద్ద నిలబెట్టి కించపరిచిందని ఎద్దేవా చేశారు. ప్రజా ప్రభుత్వంలో వ్యవస్థను ప్రశ్నించే స్వేచ్ఛ ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. డీఎస్సీ నియామక ప్రక్రియపై న్యాయస్థానాల్లో 336 కేసులు దాఖలైన విషయాన్ని మంత్రి గుర్తుచేస్తూ, కోర్టు ఆదేశాలకు అనుగుణంగా దేశ చరిత్రలోనే తొలిసారిగా డీఎస్సీలో వర్టికల్, హారిజాంటల్ రిజర్వేషన్లను పక్కాగా అమలు చేశామని వెల్లడించారు. ఇక ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ కి సంబంధించి 3.68 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, అందులో 1.87 లక్షల మంది ఉత్తీర్ణత సాధించారనే గణాంకాలను అసెంబ్లీ వేదికగా లోకేశ్ సమర్పించారు.

### ఏపీ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం..

# గైర్హాజరైన జగన్, వైసీపీ ఎమ్మెల్యేలు

గైర్హాజరయ్యారు. సభ ప్రారంభానికి ముందు తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వెంకటపాలెంలోని ఎన్టీఆర్ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించి సభకు చేరుకున్నారు. సభ ప్రారంభమైన వెంటనే స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రశ్నోత్తరాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజధాని అమరావతిలో సాగుతున్న నిర్మాణ పనులపై ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ సభలో కీలక వివరాలు వెల్లడించారు. రాజధాని ప్రాంతంలో మొత్తం 119 పనులను ప్రతిపాదించగా, 103 పనులకు 'ల్యాండ్ ఆఫ్ ఇంటెంట్' జారీ చేశామని, ప్రస్తుతం 97 పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. వరల్డ్ బ్యాంక్, ఏడీబీ, నాబార్డ్‌ల ద్వారా రూ. 41,187.7 కోట్లు టై-అప్ కాగా... ఇప్పటివరకు రూ. 12,737.13 కోట్లు ఖర్చు చేసినట్లు స్పష్టం చేశారు. అలాగే ల్యాండ్ పూలింగ్ కింద భూములు ఇచ్చిన 30,173 మంది రైతులకు 71,293 రిటర్నబుల్ ప్లాట్లను కేటాయించామని, కౌలు కింద రైతులకు రూ. 2,248.03 కోట్లు చెల్లించామని వివరించారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో సింహాచలంలో జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలల ఏర్పాటు, యనమదుర్రు డ్రెయిన్ ఆధునికీకరణ, మౌలిక వసతులు, నిర్మాణ కార్మికుల సంక్షేమంపై మంత్రులు వివరాలు అందించారు. ప్రశ్నోత్తరాలు ముగిసిన అనంతరం స్పీకర్ నేతృత్వంలో బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏజ) సమావేశమై ఈ వర్షాకాల సమావేశాల పనిదినాలు, షెడ్యూల్‌ను ఖరారు చేయనుంది. మరోవైపు శాసనమండలి సమావేశాలు కూడా ఉదయం ప్రారంభమయ్యాయి. మండలి సమావేశాలకు వైసీపీ ఎమ్మెల్సీలు హాజరయ్యారు. డీఎస్సీలో అక్రమాలు జరిగాయని... దీనిపై సీబీఐ చేత విచారణ చేయించాలని వైసీపీ సభ్యులు పట్టుబడుతున్నారు. దీంతో, సభలో గందరగోళం నెలకొంది.

# భాజపా జాతీయ ఉపాధ్యక్షురాలిగా పురందేశ్వరి.. కాషాయ దళం కొత్త

చోటు దక్కించుకున్నారు. వీరంతా భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సారథ్యంలో పనిచేయనున్నారు. అలాగే, కేంద్ర మాజీమంత్రి స్మృతి ఇరానీ జాతీయ ప్రధాన కార్యదర్శుల్లో ఒకరిగా నియమితులై పార్టీలోని కీలకమైన సంస్థాగత బాధ్యతల్లోకి తిరిగి వచ్చారు.

**భాజపా కొత్త టీమ్ ఇదే..**

పార్టీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత): బీఎల్ సంతోష్ (దిల్లీ). జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శులు: శివ్‌ప్రకాశ్ (ముంబయి), సౌదన్ సింగ్ (చండీగఢ్). జాతీయ ప్రధాన కార్యదర్శులు: వినోద్ తావ్డే (మహారాష్ట్ర), సునీల్ బన్సాల్ (దిల్లీ), బిప్లబ్ కుమార్ దేబ్ (త్రిపుర), స్మృతి ఇరానీ (ఉత్తర్‌ప్రదేశ్), డా.సతీష్ పూనియా (రాజస్థాన్), గజేంద్ర పటేల్ (మధ్యప్రదేశ్), హరీష్ ద్వివేది (ఉత్తర్‌ప్రదేశ్), సంజయ్ భాటియా (హరియాణా) జాతీయ కార్యదర్శులు: కవిత పటిదార్ (మధ్యప్రదేశ్), సురేంద్రన్ (కేరళం), డా.భోలా సింగ్ (ఉత్తర్‌ప్రదేశ్), డా ప్రదీప్ వర్మ (ఝార్ఖండ్), జగదీశ్ ఈశ్వర్‌భాయ్ పటేల్ (గుజరాత్), డా సందీప్ పాఠక్ (దిల్లీ), ఫాంగ్నాన్ కొన్యాక్ (నాగాలాండ్), సంగీత యాదవ్ (ఉత్తర్‌ప్రదేశ్), అనిల్ ఆంటోనీ (కేరళం), డా ఎం.వెంకటేశన్ (తమిళనాడు), మనోజ్ తిగ్గ (పశ్చిమబెంగాల్), సిద్ధార్థ్ శంభు (బిహార్), డా.స్వదేశ్ సింగ్ (దిల్లీ), మృగంకా దేవ్ బర్మన్ (అస్సాం), రోహన్ గుప్తా (గుజరాత్), జయప్రకాశ్ (దిల్లీ). జాతీయ కోశాధికారి: పీయూష్ గోయల్ (మహారాష్ట్ర). జాతీయ సంయుక్త కోశాధికారి: రాజేశ్ మంగల్ (రాజస్థాన్). సెంట్రల్ ఆఫీస్ ఇన్‌ఛార్జి: తరుణ్ చుగ్ (పంజాబ్) సెంట్రల్ ఆఫీస్ కార్యదర్శి : మహేంద్ర పాండే (ఉత్తరాఖండ్). నార్త్ ఈస్ట్ కోఆర్డినేటర్- డా సంబిత్ పాత్రా (ఒడిశా). నార్త్ ఈస్ట్ జాయింట్ కోఆర్డినేటర్ - రాజీవ్ బబ్బర్ (దిల్లీ). ఆల్ సెల్స్ కోఆర్డినేటర్: విష్ణుదత్ శర్మ (మధ్యప్రదేశ్). ఆల్ సెల్స్ జాయింట్ కోఆర్డినేటర్స్: రితురాజ్ సిన్హా (బిహార్), విష్ణువర్ధన్ రెడ్డి (ఆంధ్రప్రదేశ్)

**మోర్చా ప్రెసిడెంట్స్:** యువమోర్చా: డా.హేమాంగ్ జోషి (గుజరాత్). మహిళా మోర్చా : రూప్ కుమారి చౌధరి (ఛత్తీస్‌గఢ్). ఓబీసీ మోర్చా : అమర్‌పాల్ మౌర్య (ఉత్తర్‌ప్రదేశ్). కిసాన్ మోర్చా - బన్సిలాల్ గుర్జర్ (మధ్యప్రదేశ్). ఎస్సీ మోర్చా : శివేష్ కుమార్ రామ్ (బిహార్). ఎస్టీ మోర్చా : డా మన్నాలాల్ రావత్ (రాజస్థాన్). మైనార్టీ మోర్చా - కున్వర్ బాసిత్ అలీ (ఉత్తర్‌ప్రదేశ్). మీడియా కన్వీనర్: అనిల్ బలూని (ఉత్తరాఖండ్) మీడియా కో-కన్వీనర్లు: ఆశీష్ ఉషా అగర్వాల్ (మధ్యప్రదేశ్), ప్రదీప్ భండారి (దిల్లీ), సిద్ధార్థ్ యాదవ్ (దిల్లీ). సోషల్ మీడియా కన్వీనర్: దీపక్ మస్కే (ఛత్తీస్‌గఢ్). సోషల్ మీడియా కో-కన్వీనర్లు: ప్రీతి గాంధీ (మహారాష్ట్ర), శివానంద్ ద్వివేది (దిల్లీ), అలోక్ భట్ (ఉత్తరాఖండ్), అరుణ్ యాదవ్ (హరియాణా). మరోవైపు, త్వరలోనే కేంద్రమంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరగనున్నట్లు కేంద్రమంత్రి రామ్‌దాస్ అఠవాలే వెల్లడించారు. భాజపా, మిత్రపక్షమైన ఎన్‌సీపీకి చెందిన కొత్త వారిని మంత్రివర్గంలోకి తీసుకుంటారనే ప్రచారం జరుగుతోంది. సంస్థాగత మార్పులు చేసిన నేపథ్యంలో కొత్తవారికి చోటు దక్కే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. తాజాగా ప్రకటించిన జాతీయ కార్యవర్గం, ఇతర ముఖ్య పదవుల్లో తెలంగాణ నుంచి ఎవరికీ చోటు దక్కకపోవడం గమనార్హం.

## మొదటి పేజీ తరువాయి

# నాగబాబుకు కేబినెట్ హోదాతో పదవి..

నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో, నాగబాబు సోదరుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. ముఖ్యమంత్రి చంద్రబాబుకు, కూటమి పక్షాల నాయకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సొసైటీ ఫర్ గ్రీనింగ్ అండ్ రీఫారెస్టేషన్ ఫర్ ఎకలాజికల్ ఎన్‌రిచ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా నాగబాబును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నియామకంపై పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. నాగబాబుకు శుభాకాంక్షలు తెలుపుతూ, "వికసిత్ ఆంధ్రప్రదేశ్--2047 సాధనలో భాగంగా రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో 50 శాతం పచ్చదనం సాధించాలనే లక్ష్యాన్ని ఆయన సమర్థమైన నాయకత్వంలో ముందుకు తీసుకువెళ్లాలని ఆకాంక్షిస్తున్నాను" అని తెలిపారు. అటవీ విస్తీర్ణం పెంపు, పునర్వనీకరణ, పర్యావరణ పరిరక్షణ వంటి కార్యక్రమాలు నాగబాబు నాయకత్వంలో మరింత వేగవంతంగా సాగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్తు తరాలకు పచ్చని ఆంధ్రప్రదేశ్‌ను అందించాలనే సంకల్పంతో చేపట్టిన ఈ కీలక బాధ్యతలో నాగబాబు విజయవంతం కావాలని కోరుకుంటున్నట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. కూటమి ప్రభుత్వంలో జనసేన నేతకు కేబినెట్ హోదాతో పదవి లభించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

# ఆదాయానికి మించిన ఆస్తుల కేసు.. రాహుల్ గాంధీకి ఊరట

సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసుపై తదుపరి విచారణ జరిగేవరకు ముందుకు తీసుకువెళ్లొద్దని అలహాబాద్ హైకోర్టుకు సూచించింది. ఆగస్టు 20న జరగాల్సిన విచారణను వాయిదా వేయాలని ఆదేశించింది. ఈ విషయం అంత తీవ్రమైనదైతే.. ఇన్నాళ్ల**అమరావతి, సిటిజన్ టైమ్స్**్లా దర్యాప్తు సంస్థలు ఎందుకు మౌనం వహించాయని ప్రశ్నించి**అమరావతి, సిటిజన్ టైమ్స్**ంది. రాహుల్ గాంధీ ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారని కర్ణాటకకు చెందిన భాజపా నేత దర్యాప్తు సంస్థలకు చేసిన ఫిర్యాదుపై గతంలో అలహాబాద్ హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ ఆరోపణలపై దర్యాప్తు చేసి, నివేదిక సమర్పించాలని ఈడీ, సీబీఐలను ఆదేశించింది. హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ.. రాహుల్ గాంధీ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. కేసును దిల్లీ హైకోర్టుకు బదిలీ చేయాలని పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా దీనిపై విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఈ కేసు విచారణను వాయిదా వేయాలని ఆదేశించింది.

# ఇరాన్‌పై అణుదాడికి అమెరికా చర్చలు

చేశారు. అణ్వాయుధాలను నియంత్రించడమే తమ లక్ష్యమని అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ బయటకు చెప్తున్నప్పటికీ.. ఇరాన్‌పై అణు దాడులు ప్రారంభించడానికి రహస్యంగా సన్నద్ధమవుతున్నారని పేర్కొన్నారు. త్వరలో ఈ అణుదాడులు చేయడానికి ట్రంప్ యంత్రాంగం ప్రణాళికలు రచిస్తోందన్నారు. ఇందుకోసం ప్రభుత్వ ఉన్నతస్థాయి అధికారులు వ్యూహాత్మక సమావేశాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఈ అణు దాడుల వల్ల ప్రపంచం మొత్తం పెద్ద సంఘర్షణలోకి.. ఆర్థిక మాంద్యంలోకి వెళ్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రజలు ముందుకు వచ్చి.. ఆయన చర్యలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. 1945లో జపాన్‌లోని హిరోషిమా, నాగసాకి నగరాలపై అణ్వాయుధాలను ప్రయోగించిన విషయాన్ని టేలర్ గ్రీన్ గుర్తు చేసుకున్నారు. ఇన్నేళ్లు గడిచినా జపాన్ ప్రజలు ఇప్పటికీ రేడియేషన్ వ్యాధులు, క్యాన్సర్, పుట్టుకతో సంక్రమించే లోపాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అదే పరిస్థితి ఇరాన్‌కు కూడా ఎదురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

**యుద్ధ నీడలో జీవించలేం..**

యుద్ధం జరుగుతున్నంతకాలం ప్రజలు భయపడుతూనే జీవించాల్సి ఉంటుందని ఇరాన్ మాజీ అధ్యక్షుడు మహమ్మద్ ఖతామీ (వీశీష్త్రుఎఖు ఖష్ట్రఘ్ఖుఎఱ) పేర్కొన్నారు. ఈ పరిస్థితులు తొలగిపోయి శాంతియుత వాతావరణం నెలకొనేలా దౌత్య విధానాలను అవలంభించాలని ప్రభుత్వానికి సూచించారు. ఇన్నాళ్లు బాహ్య ఒత్తిడిని తట్టుకొని ప్రభుత్వం నిలబడినప్పటికీ.. యుద్ధ పరిస్థితులు ఇలాగే కొనసాగితే ప్రజల్లో అసంతృప్తి పెరిగే అవకాశం ఉందన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే భారీ కుట్ర భగ్నం: అమిత్ షా

ఛిన్నాభిన్నం చేసినట్లు పేర్కొన్నారు. ఉగ్రవాదంపై నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న జీరో టాలరెన్స్ విధానానికి ఈ విజయమే నిదర్శనమని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, ఆగస్టు 12వ తేదీన దేశవ్యాప్తంగా 14 రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఈ ఆపరేషన్?లలో మొత్తం .253 మందిని అదుపులోకి తీసుకోగా, 200 మందికి పైగా నిందితులను అధికారికంగా అరెస్ట్ చేశారు. ఈ వ్యవహారంలో ఇప్పటివరకు 80కి పైగా ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌లో 62 మంది, హర్యానాలో 52, ఢిల్లీలో 51, పంజాబ్‌లో 44 మందిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి ఐఈడీలు, పాకిస్థాన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ముద్రలు కలిగిన గ్రెనేడ్లు, పిస్టళ్లు, మందుగుండు సామాగ్రితో పాటు గూఢచర్యం కోసం వినియోగించే రహస్య కెమెరాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. షాజాద్ భట్టి నెట్‌వర్క్, ప్రధానంగా గ్రెనేడ్, ఐఈడీలు, పెట్రోల్ బాంబు దాడులతో పాటు లక్షిత హత్యలకు కుట్ర పన్నుతున్నట్లు అధికారులు వివరించారు. పోలీసు స్టేషన్లు, రక్షణ సంస్థలు, మతపరమైన ప్రదేశాలపై నిఘా ఉంచేందుకు ఈ ముఠా స్థానికులకు భారీగా నగదు చెల్లించిందని ప్రాథమిక విచారణలో వెల్లడైంది.

## తైక్వాండో పోటీల్లో కేజీబీవీ విద్యార్థిని భాసిత విజయం



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్ ఆగస్టు 17**

జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో పద్మనాభం కేజీబీవీ విద్యార్థిని జి. భాసిత అద్భుత ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకం సాధించింది. పెదగంట్యాడలోని ఉక్కు కళా వేదికలో ఆగస్టు 16న నిర్వహించిన జిల్లా కోరుగి ఒ పూమ్సే తైక్వాండో ఛాంపియన్షిప్--2026లో జూనియర్ విభాగంలో భాసిత పాల్గొని గోల్డ్ మెడల్ సాధించి పాఠశాలకు, జిల్లాకు గర్వకారణంగా నిలిచింది. ప్రస్తుతం పద్మనాభం కేజీబీవీ లో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న భాసిత, విద్యాభ్యాసంతో పాటు క్రీడల్లోనూ తన ప్రతిభను చాటుకుంది. తైక్వాండో కోచ్ సురేష్ మార్గదర్శకత్వంలో నిరంతర సాధన, క్రమశిక్షణతో శిక్షణ పొంది ఈ విజయాన్ని సాధించింది. భాసిత సాధించిన విజయంపై పద్మనాభం కేజీబీవీ ప్రిన్సిపాల్ కె. గ్రేస్ లిల్లీ హర్షం వ్యక్తం చేసి విద్యార్థినిని అభినందించారు. క్రీడల్లో బాలికలకు మరిన్ని అవకాశాలు కల్పించడం ద్వారా వారి ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు అభివృద్ధి చెందుతాయని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి ఎన్. ప్రేమ్ కుమార్, ఏపీసీ డా. జె. చంద్రశేఖర్, జీసీడీఓ జి.శ్రీదేవి భాసితను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది కూడా విద్యార్థిని అభినందించారు. భాసిత సాధించిన ఈ విజయం పద్మనాభం కేజీబీవీ విద్యార్థినులకు స్ఫూర్తిగా నిలుస్తుందని, భవిష్యత్తులో మరింత మంది విద్యార్థినులు క్రీడా రంగంలో రాణించేందుకు ప్రోత్సాహం ఇస్తుందని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.

## సగంలో ఆగిపోయిన రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి

**వలందపేట వాసుల ఆందోళన, వర్షాలతో ఇబ్బందులు**



**భీమిలి సిటిజన్ టైమ్స్ ఆగస్టు 17**

సంగివలస రెవెన్యూ వలందపేట లో సగంలో నిలిపివేసిన సిమెంట్ రోడ్డు పనులను తక్షణమే పునఃప్రారంభించి పూర్తి చేయాలని స్థానికులు జోనల్ కమిషనర్ ను కోరారు. వలందపేట గ్రామానికి చెందిన లచ్చుబుగత గణపతి రావు సోమవారం భీమిలి జోనల్ కమిషనర్ ఏం. విజయ్ కుమార్ కు వినతి పత్రం సమర్పించారు.సర్వే నం. 27/2, శశి కాలేజీ వెనుక భాగం వలందపేట లో సి సి రోడ్డు నిర్మాణ పనులు గతంలో ప్రారంభమైనప్పటికీ కొన్ని సాంకేతిక కారణాలతో అర్ధాంతరంగా నిలిపివేశారని స్థానిక ప్రజలు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. రోడ్డు కోసం తవ్విన ప్రాంతం అలాగే వదిలివేయడం తో కురుస్తున్న వర్షాలకు బురదగా మారి స్థానికులు, ముఖ్యంగా చిన్న పిల్లలు.వయోవృద్ధులు నడవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గతంలో ఇదే విషయంపై జూన్ 15వ తేదీన ఇచ్చిన వినతి పత్రానికి స్పందించి అధికారులు రోడ్డు పనులు ప్రారంభించారని, అందుకు కృతజ్ఞతలు తెలిపారు. సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చి నిలిచిపోయిన పనులను పునరుద్ధరించి త్వరగా పూర్తి చేయాలని స్థానికులు కమిషనర్ ను కోరారు ఈ కార్యక్రమంలో ఎల్ పద్మావతి ఎం పాల్ గుణ రావు ఎం బాలకిషోర్ నాగరాజు పాల్గొన్నారు.

## జేజే పవర్ జిమ్ విద్యార్థులు రాష్ట్రస్థాయి యోగాసన పోటీలకు ఎంపిక

**జిల్లాస్థాయిలో రోహిత్ ప్రథమం, మౌనిక ద్వితీయం**

**భీమిలి సిటిజెన్ టైమ్స్ ఆగష్టు 17:**

విశాఖ యోగ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యోగాసన పోటీలు ఇటీవల నిర్వహించారు.ఈ పోటీల్లో భీమిలి బ్యాంక్ కాలనీ కీతినిపేటకు చెందిన జేజే పవర్ జిమ్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జిల్లాస్థాయి పోటీల్లో కడమంటి రోహిత్ కుమార్ ప్రథమ స్థానం మల్లేటి మౌనిక ద్వితీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు. నేషనల్ యోగ రిఫరీ, ఫిట్నెస్ ట్రైనర్ శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్రస్థాయి యోగాసన పోటీలు ఈ నెల 29వ తేదీ నుండి 30వ తేదీ వరకు విశాఖ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు జిమ్‌కు పేరు తీసుకువచ్చిన విద్యార్థులను స్థానికులు అభినందిస్తున్నారు.




# సర్దార్ గౌతు లచ్చన్న 117 వ జయంతి వేడుకలు





**విశాఖపట్నం,సిటిజన్ టైమ్స్ ఆగస్టు 17**

విశాఖ జిల్లా జై యాత యువసేన సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో స్వతంత్ర సమరయోధుడు బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి గీత కార్మికుల ముద్దుబిడ్డ రైతు బాంధవుడు సర్దార్ గౌతు లచ్చన్న 117 వ జయంతి వేడుకలు ఘనంగా పద్మనాభం మండలం కుర్రపల్లి గ్రామంలో ఆయన యొక్క చిత్రపటానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేసి పిల్లలకు మిఠాయిలు పంచడం జరిగింది. జోహార్ సర్దార్ గౌతు లచ్చన్న మహారాజుకి జోహార్ జోహార్ అంటూ నినాదాలతో కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో విశాఖపట్నం జిల్లా జై యాత యువసేన సంక్షేమ సంఘం అధ్యక్షుడు కుప్ప రాజశేఖర్ మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో జన్మించి భారతదేశ స్వతంత్ర పోరాట యోధుడిగా పేరుగాంచిన ఉత్తరాంధ్ర ముద్దుబిడ్డ, స్వతంత్ర సమరయోధుడు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, గీత కార్మికుల ముద్దుబిడ్డ, రైతు బాంధవుడు అయినటువంటి సర్దార్ గౌత లచ్చన్న అతి చిన్న వయసులో రైతుల తరపున బడుగు బలహీన వర్గాల తరపున పోరాడిన వీరుడు భారతదేశానికి స్వతంత్రం తీసుకురావాలని బ్రిటిష్ వారిని ఎదిరించి అనేకసార్లు జైలు జీవితాన్ని గడిపిన నిజమైన స్వాతంత్ర పోరాట యోధుడు మన సర్దార్ గౌతు లచ్చన్న . ఉద్యమాల్లో తన 21వ ఏట గాంధీజీ పిలుపు విని విద్యకు స్వస్తి చెప్పి స్వాతంత్ర్యోద్యమంలో దూకాడు. 1930 లో మహాత్మాగాంధీ ఉప్పు సత్యాగ్రహానికి పిలుపినిచ్చాడు. దీనికి ప్రభావితుడైన లచ్చన్న బారువా సమీపంలో ఉన్న సముద్రపు నీరుతో ఉప్పు తయారుచేసి ఆ డబ్బుతో ఆ ఉద్యమాన్ని నడిపాడు. విదేశీ వస్తు బహిష్కరణోద్యమంలో పాల్గొని అందరూ చూస్తుండగానే తన విలువైన దుస్తులను అగ్నికి అహుతి చేశాడు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొంటున్నప్పుడు లచ్చన్నను అరెస్టు చేసి టెక్కలి, నరసన్నపేట సబ్ జైళ్లల్లో నలభై రోజులు ఉంచారు. కోర్టు తీర్పు మేరకు మరో నెల రోజుల శిక్షను అతను బరంపురం జైల్లో అనుభవించవలసి వచ్చింది. 1932 వ సంవత్సరంలో శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొంటున్న లచ్చన్నను బంధించి రాజమండ్రి జైల్లో ఐదు మాసాలు ఉంచారు. రాజకీయాలకూ, సంఘసంస్కరణలకుఎ సంబంధమేర్పరచి గాంధీజీ స్వాతంత్ర్యోద్యమాలు నడిపాడు. అందులోని భాగమే అంటరానితనం నిర్మూలన. అంటరానితనం మీద కత్తి ఝుళిపించాడు లచ్చన్న.అతను నడిపిన హరిజన సేవా సంఘాలు, చేపట్టిన హరిజన ఉద్యమాలు అనేకం అని చేసే కార్యక్రమాల్లో ముఖ్యమైనది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సర్దార్ గౌతు లచ్చన్న జయంతులు మరియు వర్ధంతిలను అధికారికంగా జరపడం మంచి విషయం అని విశాఖపట్నం జిల్లా జై యాత యువసేన సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు కుప్ప రాజశేఖర్ హర్షం వ్యక్తం చేశారు.

పద్మనాభం మండలం కుర్రపల్లి గ్రామంలో యాత కులానికి చెందిన విద్యార్థులకు గత సంవత్సరం 10వ తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు సంఘం తరపున షీల్డ్ ప్రశంస పత్రం నగదు బహుమతి ఇవ్వడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో భీమిలి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుప్ప రామలక్ష్మి, పద్మనాభం కల్లుగీత సహకార సంఘం ప్రెసిడెంట్ జుత్తిక ఎర్ని నాయుడు సెక్రటరీ బత్తిన అప్పారావు, బత్తిన పెంటయ్య, రీస్ గౌరి నాయుడు, జై యాత యువసేన సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ముడసల శ్రీను, వర్కింగ్ ప్రెసిడెంట్ గండి బోయిన రాంబాబు, జనరల్ సెక్రటరీ రీస్ సంతోష్ కుమార్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా ఎమ్మెల్సీ కొణిదల నాగబాబు నియామకం

**- క్యాబినెట్ హోదా కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు**

**- త్వరలో నియామక బాధ్యతలు చేపట్టనున్న నాగబాబు**



**విశాఖపట్నం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 17:**

ఆంధ్రప్రదేశ్‌లో పచ్చదనం, అటవీ విస్తీర్ణం, పర్యావరణ పరిరక్షణకు మరింత ప్రాధాన్యతనిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 'ఆంధ్రప్రదేశ్ సొసైటీ ఫర్ గ్రీనింగ్ అండ్ రీఫారెస్టేషన్ ఫర్ ఎకలాజికల్ ఎన్‌రిచ్‌మెంట్ (ఏపీ గ్రీన్)' ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్‌పర్సన్‌గా ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యులు కొణిదెల నాగేంద్రరావు (నాగబాబు) ని నామినేట్ చేస్తూ రాష్ట్ర పర్యావరణ, అటవీ శాఖ జి .ఓ .ఆర్టీ .నేం .93, తేదీ 17-08-2026ను జారీ చేసింది. ఈ నియామకంతోపాటు, ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్‌పర్సన్‌గా నాగేంద్రరావు క్యాబినెట్ హోదా కల్పిస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

**2047 నాటికి 50 శాతం గ్రీన్ కవర్ లక్ష్యం**

ఆంధ్రప్రదేశ్‌లో అటవీ పరిరక్షణ, పచ్చదనం పెంపు కలిపి రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో 50 శాతానికి పెంచడం ఏపీ గ్రీన్ ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించింది. ఈ లక్ష్యాన్ని 2047 నాటికి సాధించే దిశగా ఏపీ గ్రీన్ పనిచేయనుంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలుచేయడానికి ఏపీ గ్రీన్ గవర్నింగ్ బోర్డు, ఎగ్జిక్యూటివ్ కమిటీతో పాటు జిల్లాస్థాయిలో పాలక మండళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. ఏపీ గ్రీన్ లక్ష్యాలు, కార్యక్రమాల అమలులో వివిధ శాఖలు, జిల్లాస్థాయి సంస్థల మధ్య సమన్వయం సాధించడం, కార్యక్రమాల అమలును వేగవంతం చేయడం, వాటి పురోగతిని పర్యవేక్షించడం వంటి కీలక బాధ్యతలను ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్‌పర్సన్‌గా నాగబాబు నిర్వహించనున్నారు. ప్రత్యేకంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టే పచ్చదనం పెంపు, పునర్వనీకరణ, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలకు జిల్లాస్థాయి వ్యవస్థలను అనుసంధానిస్తూ సమర్థవంతమైన అమలు వ్యవస్థను బలోపేతం చేయడంలో ఈ నియామకం కీలకంగా నిలవనుంది. రాష్ట్ర భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పర్యావరణ సమతుల్యతను కాపాడటం, అడవులు, చెట్ల విస్తీర్ణాన్ని పెంచడం, పునర్వనీకరణ కార్యక్రమాలను విస్తృత స్థాయిలో చేపట్టడం వంటి అంశాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నదనడానికి ఏపీ గ్రీన్ ఏర్పాటు, దాని ఎగ్జిక్యూటివ్ కమిటీకి చైర్‌పర్సన్ నియామకం నిదర్శనంగా నిలుస్తుంది. కొణిదల నాగబాబు నాయకత్వంలో ఏపీ గ్రీన్ కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా మరింత సమర్థవంతంగా ముందుకు సాగుతాయని, "పచ్చని ఆంధ్రప్రదేశ్ -- ఆరోగ్యకరమైన ఆంధ్రప్రదేశ్" లక్ష్య సాధనకు ఈ వ్యవస్థ దోహదపడుతుందని ఆశాభావం కూటమి భాగస్వామ్య పార్టీల నుండి వ్యక్తమవుతోంది.

# శ్రీ ముద్ర స్కూల్ ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

**ఆనందపురం. సిటిజన్ టైమ్స్ ఆగస్టు 17**

ఆనందపురంలోని ది ఐ స్కూల్ ప్లే స్కూల్, శ్రీముద్రా స్కూల్ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. 56వ బెటాలియన్ ఐటీబీపీ ఇన్‌స్పెక్టర్ విక్రమ్ సింగ్ ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థుల దేశభక్తి ప్రదర్శనలను వీక్షించి అభినందించారు. విద్యార్థులు దేశభక్తి గీతాలు, ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. చిన్నారుల్లో దేశం పట్ల గౌరవం, జాతీయ భావన, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతలను పెంపొందించేలా వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థుల ప్రదర్శనలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ విక్రమ్ సింగ్ మాట్లాడుతూ చిన్న వయస్సు నుంచే విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, నైతిక విలువలను పెంపొందించడం అభినందనీయమన్నారు. విద్యతో పాటు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. విద్యార్థుల ప్రతిభ, క్రమశిక్షణ, దేశభక్తి ప్రదర్శనను ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల డైరెక్టర్లు కుప్పా లహరి, పల్లి వీరస్వామి, కాకర సురేష్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు పాఠ్యపుస్తక పరిజ్ఞానంతో పాటు విలువలతో కూడిన విద్యను అందించడమే తమ లక్ష్యమన్నారు. పర్యావరణ పరిరక్షణ, దేశభక్తి, సామాజిక బాధ్యత వంటి అంశాలపై విద్యార్థుల్లో




అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఆనందపురం ప్రాంతంలో ఆధునిక సౌకర్యాలతో పాటు విలువలకు ప్రాధాన్యమిస్తూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు విద్యలోనే కాకుండా వ్యక్తిత్వ వికాసంలోనూ రాణించేలా, సమాజానికి ఉపయోగపడే బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడమే తమ ఉద్దేశమని పాఠశాల యాజమాన్యం తెలిపింది. కార్యక్రమంలో మండల క్లస్టర్ ఇన్‌చార్జి మీసాల సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు కోట్యాడ రెడ్డిబాబు, కుప్ప నర్సునాయుడు, జైజవాన్ ఫౌండేషన్ ప్రతినిధులు కుప్ప రాజశేఖర్, రామలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## బోని మాన్సాస్ భూ సమస్యను పరిష్కరించాలి




**ఆనందపురం, సిటిజన్ టైమ్స్. ఆగస్టు 17**

ఆనందపురం మండలం మండలం బోని గ్రామంలో దీర్ఘకాలంగా కొనసాగుతున్న మాన్సాస్ భూ సమస్యను పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని రాష్ట్ర నాగావంశం డైరెక్టర్, ఆనందపురం మండల టీడీపీ ఉపాధ్యక్షుడు సూరాల సత్యవర ప్రసాద్ కోరారు. ఈ మేరకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు బోని గ్రామ ప్రజల తరఫున వినతిని అందించారు. స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి ఈ భూ సమస్య కొనసాగుతోందని, దీనివల్ల గ్రామంలోని రైతులు, ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గతంలో ఈ భూములకు రిజిస్ట్రేషన్లు జరిగేవని, బ్యాంకులు సైతం వ్యవసాయ రుణాలు మంజూరు చేసేవని పేర్కొన్నారు. ప్రస్తుతం రెవెన్యూ శాఖ నుంచి అడంగల్ కాపీలు అందకపోవడంతో రైతులకు వ్యవసాయ రుణాలు మంజూరు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా రెవెన్యూ శాఖ నుంచి ఫారం-3 జారీ కాకపోవడంతో వ్యవసాయ అవసరాల కోసం కొత్త మోటార్లు, విద్యుత్ కనెక్షన్లు పొందడంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. భూ సమస్య కారణంగా అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రత్యేక చొరవ తీసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని బోని గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేశారు. రైతుల సమస్యను పరిష్కరించి వారికి అండగా నిలుస్తారనే నమ్మకం ఉందని సూరాల సత్యవర ప్రసాద్ అన్నారు.

## మున్సిపల్ ఎన్నికలకు సమాయత్తం

**కమిషనర్ నిర్మల్ కుమార్**

**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 17**

మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సమాయత్తం అవుతున్నట్లు అమలాపురం మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్ తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు, జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ సూచనలతో సెప్టెంబర్3 నాటికి డ్రాఫ్ట్ వాటర్ జాబితా, సెప్టెంబర్ 30 తుది జాబితా ప్రచురణ కు సిద్ధం అవుతున్నట్లు తెలిపారు. అమలాపురం మున్సిపల్ 36 వార్డులకు సంబంధించి వార్డువైజ్ డిజిటల్ రూల్ పబ్లిష్, ఎలక్ట్రికల్ రోల్ మేనేజ్ సిస్టం, జనవరి 1 ,2026 వరకు ఓటర్ మ్యాప్ చేసుకుంటామని తెలిపారు. జనవరి 2026 నాటికి మున్సిపాలిటీ కి సంబంధించి 40, వేల 932 ఓటర్లు ఉన్నారని, ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు ప్రకారం ఓటర్ జాబితా ప్రచురించడం, రిజర్వేషన్స్ ఖరారు చేయడం జరుగుతుందని కమిషనర్ వి నిర్మల్ కుమార్ తెలిపారు.



# చేపల వేటకు వెళ్లి తిరిగి రాని మత్స్యకారుల పడవ

## కోస్ట్‌గార్డ్‌తో సమన్వయం చేసి గాలింపు, రక్షణ చర్యలు చేపట్టాలి

## – జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్



**అమలాపురం, సిటిజన్ టైమ్స్ ఆగస్టు 17**

డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం వోడలరేవు ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌కు చెందిన ఐఎన్డి- ఏపీ- ఇ8- ఎం-135 రిజిస్ట్రేషన్ నంబర్ గల మత్స్యకార బోటు చేపల వేటకు వెళ్లి నిర్ణీత గడువులోగా తిరిగి రాకపోవడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ బోటు ఆగస్టు 3వ తేదీన చేపల వేటకు బయలుదేరగా, ఆగస్టు 13న తిరిగి రావాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు వోడలరేవు ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌కు చేరుకోలేదు. బోటులో సుమారు 15 రోజుల పాటు సరిపడే రేషన్, 1,000 లీటర్ల డీజిల్ ఉన్నట్లు అధికారులు తెలిపారు. బోటు విశాఖపట్నం, పారాదీప్ తీర ప్రాంతాల వైపు చేపల వేటకు వెళ్లినట్లు ప్రాథమికంగా గుర్తించారు. బోటులో యజమాని కమ్ డ్రైవర్ కోపనాతి రామకృష్ణ వర్మతో పాటు మొత్తం 8 మంది మత్స్యకారులు ఉన్నట్లు మత్స్యశాఖ అధికారులు తెలిపారు. బోటులోని మత్స్యకారులను ఫోన్ ద్వారా సంప్రదించేందుకు ప్రయత్నించినప్పటికీ స్పందన లేకపోవడంతో జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ పరిస్థితిపై ప్రత్యేక దృష్టి సారించారు. మత్స్యకారుల ఆచూకీ కోసం ఇండియన్ కోస్ట్‌గార్డ్‌కు తక్షణమే సమాచారం అందించి, గాలింపు, రక్షణ చర్యలు చేపట్టేందుకు అవసరమైన సమన్వయం చేయాలని జిల్లా మత్స్యశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా ఎస్పీ రాహుల్ మీనాతో సమన్వయం చేసుకుని, సంబంధిత పోలీసు యంత్రాంగం ద్వారా బోటు యజమాని, కుటుంబ సభ్యులు, ఇతర మత్స్యకారుల నుంచి అందుబాటులో ఉన్న సమాచారాన్ని సేకరించి, కోస్ట్‌గార్డ్ మరియు ఇతర సంబంధిత రక్షణ సంస్థలకు అందించాలని కలెక్టర్ సూచించారు. బోటు ఆచూకీ, మత్స్యకారుల భద్రతకు సంబంధించిన ప్రతి అంశాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ, లభించే సమాచారాన్ని వెంటనే జిల్లా యంత్రాంగానికి తెలియజేయాలని జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, జిల్లా మత్స్యశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మత్స్యకారుల కుటుంబ సభ్యులకు అవసరమైన సమాచారం అందిస్తూ, వారి భద్రత కోసం చేపడుతున్న చర్యలపై ఎప్పటికప్పుడు వివరాలు తెలియజేయాలని అధికారులకు సూచించారు. మత్స్యకారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, సంబంధిత శాఖలు, ఇండియన్ కోస్ట్‌గార్డ్, పోలీసు యంత్రాంగం సమన్వయంతో బోటు ఆచూకీ కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేస్తున్నామని జిల్లా కలెక్టర్ డా.ఆర్.మహేష్ కుమార్ తెలిపారు.

# చిన్నారికి రూ.11 వేలు ఆర్థిక సహాయం



**అయినవిల్లి సిటిజన్ టైమ్స్ ఆగస్టు17**

మండలంలోని తొత్తరమూడి గ్రామ పంచాయతీ పరిధి ,కొడవటివారిలంక గ్రామంలో కాలేయ వ్యాధితో బాధపడుతున్న (చిన్నారి) మట్టపర్తి కార్తీ తండ్రి మట్టపర్తి లక్ష్మణ్‌కుమార్) కు పి.గన్నవరం కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో అయినవిల్లి మండల వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ తరపున మట్టపర్తి కార్తీక్ చికిత్స కోసం రూ.11,000 ఆర్థిక సహాయం చేయడంజరిగింది. ఈ కార్యక్రమములో కోఆర్డినేటర్ తో మండల పార్టీ అధ్యక్షులు మేడిశెట్టి శ్రీనుబాబు, తొత్తరమూడి వైఎస్ఆర్ సీపీ గ్రామశాఖ అధ్యక్షులు రమణతి రాంబాబు, జితుక రాంబాబు, బీర సత్యనారాయణ,అంకం కుమారస్వామి, మట్టపర్తి సత్యనారాయణ, పలివెల శ్రీనివాస్, మట్టపర్తి శ్రీను ,మూర్తి ,తదితరులు పాల్గొన్నారు.

# అకాడమిక్ ఇన్స్ట్రక్టర్ పోస్టులలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించాలి

## ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్



**ముమ్మిడివరం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 17**

త్వరలో విద్యాశాఖలో నియమింపడే అకాడమిక్ ఇన్స్ట్రక్టర్ల ఉద్యోగులలో రూల్ రిజర్వేషన్ పాటించాలని ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా శాఖ సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి మహబూబ్ బాషా ని కలిసి వినతి పత్రం సమర్పించింది. స్టడీ లీవ్ ఉపయోగించుకున్న ఉపాధ్యాయులకు ఇంక్రిమెంట్స్ జాప్యం లేకుండా మంజూరు చేయాలని, ఎస్సి ఎస్టి ఉపాధ్యాయులకు స్టడీ లీవ్స్ వెంటనే మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా డిఈఓ సమస్యలన్నింటినీ సానుకూలంగా పరిష్కరిస్తానని సభ్యులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గోసంగి బంగార్రాజు, ప్రధాన కార్యదర్శి బత్తుల రమేష్ బాబు, గౌరవ అధ్యక్షులు ఎన్ఈకె బీమారావు, ఎస్.ఎన్ మునీశ్వర రావు, డి.సురేష్ బాబు, జలిపల్లి బాలకృష్ణ, మట్టా శ్రీనివాసరావు, జలిపల్లి భీమారావు, కటిక దల రాము, సిహెచ్ తిరుపతిరావు, ఎం లక్ష్మణకుమార్, యు.దశరథ రామయ్య, కుంచె వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

## ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేసిన జిల్లా ఎస్పీ రాహుల్ మీనా



విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని అంబేద్కర్ కోనసీమ జిల్లా లిఎస్పీ రాహుల్ మీనా, సూచించారు. ఆర్థిక ఇబ్బందులు విద్యార్థుల చదువుకు అడ్డంకిగా మారకుండా వారికి అండగా నిలుస్తూ విద్యాభ్యాసానికి సహకారం అందిస్తున్న క్రెడిట్ యాక్సెస్ లిగ్రామీణ్ లిమిటెడ్, క్రెడిట్ యాక్సెస్ ఇండియా ఫౌండేషన్ సంస్థలలి సేవలను ఆయన అభినందించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ్ లిమిటెడ్, క్రెడిట్ యాక్సెస్ ఇండియా ఫౌండేషన్ సంస్థల సహకారంతో లిడాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఆరుగురు ప్రతిభావంతులైన విద్యార్థులు డి. శ్వేత, డి . రేవతి, ఎన్.యశ్వంత్, పి .కీర్తి, కె .అమిత , ఏ.విజయదుర్గా స్కాలర్‌షిప్‌లకు ఎంపిక చేశారు. జిల్లా ఎస్పీ రాహుల్ మీనా చేతుల మీదుగా ఒక్కొక్క విద్యార్థికి రూ.10,000 చొప్పున స్కాలర్‌షిప్‌లను అందజేశారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ...విద్యార్థి దశ జీవితంలో అత్యంత కీలకమైన దశ అని పేర్కొన్నారు. ఈ దశలో విద్యతో పాటు క్రమశిక్షణ, సమయపాలన, పట్టుదల, సానుకూల ఆలోచనా విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ విద్యలో రాణించాలని అన్నారు. ఆర్థిక పరిస్థితులు చదువుకు అడ్డంకిగా మారకుండా ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ్ విశాఖపట్నం రీజినల్ మేనేజర్ బి. వెంకట రమణ, ఏరియా మేనేజర్ షేక్ జమీర్ బాష, మేనేజర్ లు ఎం.చిన్న, వై.పోలినాయుడు, టి.లోవరాజు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభ్యాసానికి తమవంతు సహకారం అందించేందుకు సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు.

# ముంపు బారీన పడిన వరిచేలు



**అమలాపురం రూరల్. సిటిజన్ టైమ్స్ ఆగస్టు 17**

మండలం సమీపంలోని సవరపాలెం గ్రామంలో సత్తి రామన్న పెంకుడు సాలలు వద్ద సత్తోరు పఠ్ర భూములు కొద్దిపాటి వర్షానికే ముంపు బారీన పడ్డాయి.వరిచేలు ఊడ్చిన రెండు రోజులకు కురిసిన వర్షం కారణంగా ముంపుబారీన పడ్డాయి. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలు కారణంగా మురుగు నీరుదిగేందుకు డ్రయిన్ సక్రంగాలేకపోవడంతో వరిచేలోనుంచి డ్రైనేజ్ లోకి మురుగునీరు దిగక ముంపుకు గురయ్యాయి. వరిమూనలు నీటలో మునిగి ఉన్నందున కుల్లి పోయే పరిస్థితి ఏర్పడుతుందని రైతులు వాపోతున్నారు. ఊడ్చిన వరిచేలు పాడవకముందే , డ్రయినేజి అధికారులు డ్రైనేజీలో పూడిక ,గుర్రపుడెక్క తీయించి,మురుగు నీరు దిగేందుకు చర్యలు తీసుకని రైతులు నష్ట పోకుండా చూడాలని రైతులు కోరుతున్నారు. డ్రైనేజీఅధికారులు శ్రద్ధ తీసుకొని చెత్త ను తొలగించి ఊడ్చిన చేలు పాడవకుండా యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకో వలసిందిగా డ్రైనేజీ, రెవెన్యూ నీటి సంఘం అధ్యక్షులను ,అధికారులను రైతులు కోరుతున్నారు.

# ప్రజా ఫిర్యాదులను వెంటనే పరిష్కారించాలి..

## - జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్



**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 17**

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన ప్రజా సమస్యలకు అధిక ప్రాధాన్యతను ఇచ్చి తప్పనిసరిగా నిర్దిష్ట గడుగులోకి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులు ఆదేశించారు. సోమవారం అంబేద్కర్ కోనసీమ జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీ ఆర్ఎస్) కార్యక్రమం అమలాపురం కలెక్టరేట్ గోదావరి భవన్ లో జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్,జాయింట్ కలెక్టర్ వై ఖోమ్. నైడియా దేవి, డీఆర్వో వి.సుబ్బారావు, పీజీఆర్ఎస్ ఎస్డీసీ డి.అచ్యుత కుమారి, డీఆర్డీఏ పీడీ డి.రాంబాబు, డ్వామా పీడీ రామ్ గోపాల్, తదితరులతో కలిసి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు అర్జీలు స్వీకరించారు. భూ రికార్డు ఆన్ లైన్ లో నమోదు, రీ సర్వే, భూ ఆక్రమణలు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, పారిశుధ్యం, మురికి కాలువలకు పుడికతీత, ఇంటిస్థలం, గృహం, పింఛను, సదరం సర్టిఫికెట్, రోడ్లు మంజురు వంటి అంశాలపై మొత్తం 216 అర్జీలు అందాయి. ఈ అర్జీలను సంబంధిత అధికారులకు సూచిస్తూ సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్ లు ఇతర అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# భూగర్భ జలాల పరిరక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలి

## ఇంకుడుగుంటల నిర్మాణాన్ని విస్తృతంగా చేపట్టాలి: నల్లా పవన్‌కుమార్

**అమలాపురం సిటిజన్ టైమ్స్, ఆగస్టు 17**

రాష్ట్రంలోని పట్టణాలు, నగర ప్రాంతాల్లో భూగర్భ జలాలు గణనీయంగా పడిపోతున్న నేపథ్యంలో ప్రభుత్వం, అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్ల పవన్‌కుమార్ కోరారు. భూగర్భ జలాల పరిరక్షణకు ఇంకుడుగుంటల నిర్మాణాన్ని విస్తృతంగా చేపట్టి, వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకించేలా శాశ్వత చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. వ్యవసాయ, పారిశ్రామిక అవసరాలకు భవిష్యత్తులో తీవ్రమైన నీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నందున ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. వాతావరణ మార్పులు, ఎల్‌నినో వంటి ప్రభావాల నేపథ్యంలో నీటి లభ్యతపై మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలతో కలిసి బీజేపీ నాయకులు అధికారుల దృష్టికి తీసుకువస్తున్న సమస్యల పరిష్కారంలో అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని నల్లా పవన్‌కుమార్ కోరారు. డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా బీజేపీ జనతా వారధి ఆధ్వర్యంలో సోమవారం అమలాపురంలోని గోదావరి భవన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. జనతా వారధి జిల్లా కన్వీనర్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, మాజీ సర్పంచ్ చీకరమెల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం ప్రజల నుంచి స్వీకరించిన వినతిపత్రాలను చీకరమెల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు జిల్లా సంయుక్త కలెక్టర్ వైఖోమ్ నిడియా దేవికి సమర్పించి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఆరిగెల పుల్లయ్య నాయుడు, అమలాపురం పట్టణ అధ్యక్షుడు అయ్యాల భాస్కరరావు, మహిళా జిల్లా ప్రధాన కార్యదర్శి కొండేటి జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# కాకినాడ కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు 292 అర్జీలు

## జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

**కాకినాడ సిటిజన్ టైమ్స్,ఆగస్టు 17**

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన ఫిర్యాదుల పట్ల అధికారులు బాధ్యతాయుతంగా స్పందించి,అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులనుఆదేశించారు. జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో జరిగింది. ఈ కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్,జిల్లా సంయుక్త కలెక్టర్ అపూర్వ భరత్, డిఆర్ ఓ డా.తిప్పేనాయక్, లతో పాటు డ్వామా పిడి మధుసూదన్, డిఆర్డీఏ పిడి జి.శ్రీనివాసరావు, బిసి కార్పొరేషన్ ఈడి ఎ.శ్రీనివాసరావు, జిల్లా స్వర్ణ గ్రామ,వార్డు అధికారి జె.వేణుగోపాల్, డీడీఓ పి.వాసుదేవర రావు, తదితరులు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు.

**రెవెన్యూ క్లినిక్ కు --32 అర్జీలు**

జిల్లా కలెక్టరేట్ లో జరిగిన రెవిన్యూ క్లినిక్ లో భాగంగా జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ తిప్పే నాయక్ ప్రజల నుంచి రెవిన్యూ సమస్యల మీద అర్జీలు స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం,సమగ్ర మైన విచారాణ చేపట్టి తగిన పరిష్కారం అందించాలని ఆయా శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు, కలెక్టరేట్ సెక్షన్ల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.



# స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అధికారులు సన్నద్ధం కావాలి..

## –జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్



**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 17**

జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహణకు అధికారులు సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ అధికారులు ఆదేశించారు. స్థానిక సంస్థల ఎన్నికలపై సోమవారం అమలాపురం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్.. జాయింట్ కలెక్టర్ వైఖోమ్ నైడియ దేవి, రెవెన్యూ, మున్సిపల్ కార్పొరేషన్, పంచాయతీ ఇతర శాఖల అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. క్షేత్ర స్థాయిలోని, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అధికారులు సమాయత్తం కావాలన్నారు. మొదటిగా మున్సిపల్ ఎన్నికలు తదుపరి పంచాయతీ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంటుందన్నారు. 2026 జనవరి నెల వరకు ఉన్న ఓటర్లతో జాబితా సిద్ధం చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి నివేధిక పంపించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి జిల్లాలోని అమలాపురం, రామచంద్రాపురం, ముమ్మిడివరం మున్సిపాలిటీ లలో వార్డులు వారీగా సెప్టెంబర్ 03 నాటికి డ్రాఫ్ ఓటరు జాబితాను, సెప్టెంబర్ 30న తుది జాబితా ప్రచురించి, రిజర్వేషన్లు ఖరారు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ పనులు అన్ని సజావుగా జరిగేందుకు మున్సిపాలిటీల కమిషనర్లు తమ పరిధిలోని ఆర్డీవో, తహశీల్దార్లతో సమన్వయం చేసుకొని పనిచేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. పంచాయతీ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో 342 పంచాయతీలు ఉన్నా యన్నారు. వీటికి సంబంధించి ఆగస్టు 23న డ్రాఫ్ట్ ఓటరు జాబితా, ఎస్సీ ఎస్టీ బీసీ ఓటర్ల గుర్తింపు సెప్టెంబర్ 07 నాటికి పూర్తిచేసి రిజర్వేషన్లు ఖరారు చేయాలన్నారు. ఎంపీడీవోలు, తహసీల్దార్లు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను క్షుణ్ణంగా పరిశీలించి నివేదిక పంపించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ ప్రక్రియ అంతా సజావుగా సాగేందుకు జిల్లా పంచాయతీ కార్యాలయం, జిల్లా కలెక్టరేట్ లో ప్రత్యేక ఎన్నికలు సెల్ ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రూపొందించిన నిబంధనలపై అధికారులు స్పష్టమైన అవగాహన పెంపొందించుకుని ప్రణాళిక ప్రకారం పని చేయాలని జిల్లా కలెక్టర్ మహేష్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఆర్ఓ వి.సుబ్బారావు, డీపీఓ డి.శాంతికుమారి,అమలాపురం మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్, రామచంద్రపురం కమిషనర్ కెవిఆర్.రాజు,ముమ్మిడివరం కమిషనర్ పి.రవివర్మ ఇతర అధికారుల, తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ ఎన్. సేతు, వై.ప్రశాంత్‌లను సన్మానించిన విశ్వహిందూ పరిషత్



**మదనపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 17 సిటిజన్ టైమ్స్**

ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియమితులైన డాక్టర్ ఎన్. సేతు , ఎల్లంపల్లి ప్రశాంత్ లను విశ్వహిందూ పరిషత్, మదనపల్లి జిల్లా కార్యవర్గం తరఫున హృదయపూర్వక అభినందనలు తెలియజేసి నూతనంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా బాధ్యతలు స్వీకరించిన వారిని ప్రత్యేకంగా విశ్వహిందూ పరిషత్ మదనపల్లి జిల్లా నాయకులు ఘనంగా సన్మానించారు. విద్యా రంగంతో పాటు సామాజిక సేవా రంగంలో కూడా తనదైన సేవలను అందిస్తున్న డాక్టర్ ఎన్. సేతు కు ఈ నియామకం మరింత బాధ్యతను, ప్రజాసేవకు మరిన్ని అవకాశాలను కల్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం, సమాజ అభ్యున్నతి కోసం కృషి చేయాలని,ఎల్లంపల్లి ప్రశాంత్ కూడా మరింత అంకితభావంతో కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ మదనపల్లి జిల్లా అధ్యక్షులు గట్టి రామ్మోహన్, ఉపాధ్యక్షులు లిశ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి సోంపల్లి సురేష్ బాబు, సహ కార్యదర్శులు వెంకటరమణ రెడ్డి, నాగప్రసాద్ నాయుడు,లి కోశాధ్యక్షులు సుధాకర్, రెడ్డెయ్య, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### కలెక్టర్ కార్యాలయం ఎదుట బీఎంఎస్ ధర్నా




**సిటిజన్ టైమ్స్ నాగర్ కర్నూల్ ఆగస్ట్ 17**

కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, యాజమాన్యాల వేధింపులు, అక్రమ తొలగింపుల నుంచి కార్మికులకు రక్షణ కల్పించాలని బీఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రమేష్ గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట బీఎంఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అధికారికి వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ గౌడ్ మాట్లాడుతూ కనీస వేతన పరిమితిని 42 వేల రూపాయలకు పెంచాలని, కార్మికుల కుటుంబాలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కోరారు. కార్మిక వ్యతిరేక నిబంధనలు తొలగించి బ్యాంకు ఉద్యోగులకు వారానికి ఐదు రోజుల పని దినాలను అమలు చేయాలని, గ్రాట్యూటీ పరిమితిని 20 లక్షల నుండి 40 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధుల నుండి కార్మికులను రక్షించాలని, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలిని ఏర్పాటు చేసి కార్మికులకు కనీస వేతన చట్టం అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి రాష్ట్ర అధ్యక్షురాలు శ్రీదేవి, బీఎంఎస్ నాయకులు సుఖజీవన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పసుపుల లక్ష్మయ్య, కోశాధికారి కుంభం ప్రకాష్, బాదం శ్రీనివాసులు, ఉద్యోగుల సంఘం నాయకులు కులకర్ణి, 108 సంఘం నాయకులు కళ్యాణ్ కార్ శ్రీను, విద్యుత్ శాఖ నాయకులు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో 6.18 లక్షల ఓటర్లు

## ఎస్ఐఆర్ డ్రాఫ్ట్ జాబితా విడుదల

### - సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్స్‌కు అవకాశం

**సిటిజన్ టైమ్స్ నాగర్ కర్నూల్ ఆగస్ట్ 17**

ఎస్ఐఆర్‌లో భాగంగా నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్ నియోజకవర్గాలకు సంబంధించిన డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను అధికారులు విడుదల చేశారు. జిల్లాలోని 910 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన డ్రాఫ్ట్ జాబితా ప్రకారం మొత్తం 6,18,592 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడైంది. వీరిలో 3,11,395 మంది పురుషులు, 3,07,182 మంది మహిళలు ఉన్నారు. అదనంగా 15 మంది ఇతర ఓటర్లు, 579 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారు. గత జాబితా నుంచి 22,669 మంది ఓటర్లు మృతి చెందినట్లు గుర్తించగా, 20,396 మంది ఓటర్లు ఇతర ప్రాంతాలకు మారినట్లు అధికారులు తెలిపారు. 18,260 మంది ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించలేదు. అర్హత ఉన్నవారి పేర్లు జాబితాలో లేనట్లయితే సెప్టెంబర్ 16లోగా క్లెయిమ్స్, అభ్యంతరాలు దాఖలు చేయాలని అధికారులు సూచించారు. ఓటర్లు తమ పేరు, చిరునామా, వయస్సు తదితర వివరాలు పరిశీలించుకోవాలని, కుటుంబంలోని అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఉందో లేదో చూసుకోవాలని కోరారు. తప్పులుంటే నిర్ణీత విధానంలో సవరణకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యంతరాలపై నిబంధనల ప్రకారం విచారణ చేపట్టి అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తామని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చర్యలు తీసుకుంటామని, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ప్రతి పౌరుడు ఓటర్ల జాబితాను పరిశీలించుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.



# హాస్టల్లో ప్రవేశాన్ని నిషేధిస్తూ

# జీవో జారిని వెంటనే రద్దు చేయాలి



**అమలాపురం సిటిజెన్ టైమ్స్ ఆగస్టు 17**

డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని ఎస్సీ, ఎస్టి ,బి సి సంక్షేమ హాస్టళ్లలోకి విద్యార్థి సంఘాలు , మీడియా ప్రవేశాన్ని నిషేధిస్తూ జారీ చేసిన జీవోను వెంటనే రద్దు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టరేట్ లో జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోమ్ నిధియా దేవి ఆర్ ఎస్ యు స్టేట్ జాయింట్ సెక్రెటరీ కంటే పల్లి నరేంద్ర వినత పత్రం అందజేశారు. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని ఎస్సి, ఎస్టి ,బిసీ హాస్టళ్లలోకి విద్యార్థి సంఘాలను మరియు మీడియా ప్రతినిధులను అనుమతించకూడదని, ప్రభుత్వం జారీ చేసిన జీవో విద్యార్థుల ప్రజాస్వామిక హక్కులకు తీవ్ర విఘాతం కలిగిస్తుందని పేర్కొన్నారు. హాస్టళ్లు కేవలం వసతి గృహాలు మాత్రమే కాదు. అవి పేద, దళిత, బహుజన విద్యార్థుల చదువుకు, ఎదుగుదలకు కేంద్రాలు. హాస్టళ్లలో తాగునీరు, భోజనం, మౌలిక వసతుల కొరత వంటి అనేక సమస్యలు ఉన్నాయి. వాటిని ప్రశ్నించేందుకు, పరిష్కరించేందుకు విద్యార్థి సంఘాల పాత్ర చాలా కీలకం అని తెలిపారు. ప్రస్తుత జీవో ద్వారా విద్యార్థి సంఘాల ప్రవేశాన్ని నిషేధించడం వల్ల విద్యార్థుల గొంతు నొక్కివేయబడి, సమస్యలు బయటకు రాకుండా పోతున్నాయి. ఇది రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛకు, సమావేశ హక్కుకు విరుద్ధం అని పేర్కొన్నారు. హాస్టళ్లలోకి విద్యార్థి సంఘాలను, మీడియాను అనుమతించాలని,విద్యార్థుల ప్రజాస్వామిక హక్కులను కాలరాసే జీవోను వెంటనే రద్దు చేయాలని,హాస్టళ్లలోని మౌలిక వసతుల సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కావున పై విషయాన్ని పరిశీలించి, ప్రభుత్వం జారీ చేసిన జీవోను వెంటనే రద్దు చేసి, విద్యార్థులకు న్యాయం చేయాలని విన్నవించుకుంటున్నాము. ఈ వినతిని పరిగణలోకి తీసుకోకపోతే ఆర్ఎస్ఎస్ యు అంబేద్కర్ కోనసీమ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉధృత ఆందోళనలులి చేపడతామని పంతేపల్లి నరేంద్ర తెలియజేసారు.

# బాధితుల సమస్యలకు సత్వర న్యాయం

## జిల్లా ఎస్.పి. రాహుల్ మీనా



అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రజల ఫిర్యాదులను స్వీకరించి, వాటికి సత్వర పరిష్కారం చూపే లక్ష్యంతో (సోమవారం) జిల్లా పోలీస్ కార్యాలయం నందు "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమం నిర్వహించబడింది. జిల్లా ఎస్.పి.రాహుల్ మీనా, జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) మహేంద్ర మత్తే తో కలిసి స్వయంగా బాధితుల నుండి అర్జీలను స్వీకరించారు.లి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బాధితులతో ఎస్.పి. ముఖాముఖిగా మాట్లాడారు. వారి సమస్యలను ఓపికగా విని, ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో మొత్తం 25 ఫిర్యాదులు నమోదయ్యాయి. వీటిలో ప్రధానంగా భూ వివాదాలు, కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాలు , సివిల్ సంబంధిత సమస్యలు ఉన్నాయి. అందిన ఫిర్యాదులను తక్షణమే సంబంధిత పోలీస్ స్టేషన్లకు పంపిస్తూ, క్షేత్రస్థాయిలో నిష్పక్షపాతంగా విచారణ జరపాలని ఎస్.పి. అధికారులను ఆదేశించారు. చట్టపరిధిలో బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలని, పెండింగ్‌లో ఉన్న అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పోలీసు వ్యవస్థపై ప్రజలకు పూర్తి నమ్మకం ఉండాలని, ప్రతి ఫిర్యాదును అత్యంత పారదర్శకంగా, జాప్యం లేకుండా పరిష్కరిస్తామని ఈ సందర్భంగా ఎస్.పి. బాధితులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్.పి. తో పాటు, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) మహేంద్ర మత్తే, డి.పి.ఓ. సిబ్బంది,ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# రైల్వే పనులు పై అవసరమైన చర్యలు చేపట్టాలి

## రైల్వే ప్రాజెక్ట్ నిర్మాణ వ్యయానికి సంబంధించి షేరింగ్ పై స్పష్టత లేదు



**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 17**

అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ సెల్ కు కోనసీమ జేఎసి కార్యవర్గం తరలి వెళ్లి, కోనసీమ రైల్వేప్రాజెక్ట్ కు భూసేకరణ త్వరితగతిన పూర్తికావడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది.రైతులకు కూడా న్యాయం చేయాలని కోరింది.ఇటీవల కాలంలో ఈ రైల్వేప్రాజెక్ట్ కు సంబంధించిన నిర్మాణపు పనులు అస్సలు జరగకపోవడం పట్ల ఆందోళన వెలిబుచ్చింది.కలెక్టర్ స్పందిస్తూ ప్రాజెక్ట్ నిర్మాణానికి,భూసేకరణను అవసరమైన నిధులు కు సంబంధించి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు షేరింగ్ పై స్పష్టత లేకపోవడం కూడా పనులు వేగవంతంగా జరగకపోవడానికి ఒక కారణంగా పేర్కొన్నారు.అయినప్పటికీ కోనసీమ ప్రజలు మనోభావాలకు అనుగుణంగా జేఎసి కార్యవర్గం చేసిన విజ్ఞప్తి ని రాష్ట్రప్రభుత్య దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. కన్వీనర్ బండారు రామమోహన్ రావు ఆధ్వర్యంలో జేఎసి సభ్యులు ఇళ్ల భక్తవత్సలం, అన్యశీ రాంబాబు, పమ్మ నాగేశ్వరావు,నూకల శ్రీనివాస్, రంకిరెడ్డి శ్రీనివాస్ తదితరులు కలెక్టర్ ను కలిసిన వారిలో ఉన్నారు.

# గాలిని శుద్ధి చేసే మొక్కలను పెంచండి

- ప్రతి ఒక్కరూ పది మొక్కలు నాటి పెంచండి.
- మనం తినే దేశీయ పండ్ల విత్తనాలతో సామాజిక వనాలు పెంచాలి
- ప్రతి విద్యార్థి పర్యావరణ హితంగా జీవించాలి
- జెవి రత్నం, వ్యవస్థాపక కార్యదర్శి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఆగస్టు 17:**

గాలిని శుద్ధి చేసే మొక్కలను పెంచండి అని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం విద్యార్థులకు పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం మర్రి పాలెం లో ప్రతిభ మోడల్ స్కూల్ విద్యా సంస్థ శ్రీనివాస్ అధ్యక్షతన మిద్దె తోటలు పెంచుతున్న ప్రకృతి ప్రేమికులు జమీర్ విద్యార్థులకు ఈ కార్యక్రమంలో గాలిని శుద్ధి చేసె మొక్కలు పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రస్తుతం శీతోష్ణస్థితి వేడెక్కుతున్న తరుణంలో ప్రతి ఒక్కరూ పది మొక్కలు నాటి పెంచాలి అని కోరారు. ప్రతి విద్యార్థికీ పర్యావరణం పట్ల అవగాహన కల్పించాల్సిన అవసరం విద్యా సంస్థల మీద ఉందన్నారు. మనం తినే దేశీయ పండ్ల విత్తనాలతో సామాజిక వనాలు పెంచాలని కోరారు. అంతేకాక ప్రతి విద్యార్థి పర్యావరణ హితంగా జీవించాలని, నిరంతరం పర్యావరణం గురించి కుటుంబీకులతొ మాట్లాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అజయ్, శ్రీనివాస్ , అకౌంటెంట్ చిన్ని తదితరులు పాల్గొన్నారు.

## గిద్దలూరు అర్బన్ స్వర్ణ వార్డు సచివాలయ సిబ్బంది ఆత్మీయ సమావేశం

### వెల్ఫేర్ ఫండ్ ఏర్పాటుకు నిర్ణయం



**గిద్దలూరు, సిటిజన్ టైమ్స్, ఆగస్టు 17:**

గిద్దలూరు ఎన్జీవో హోం మీటింగ్ హాల్ లో సోమవారం,గిద్దలూరు అర్బన్ స్వర్ణ వార్డు సచివాలయ సిబ్బంది ఆత్మీయ ఉమ్మడి సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గిద్దలూరు అర్బన్ పరిధిలోని 10 వార్డు సచివాలయాలకు చెందిన అన్ని విభాగాల కార్యదర్శులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులందరూ ఒకరికి ఒకరు సహాయం చేసుకుంటూ, ఎల్లప్పుడూ ఐకమత్యంగా ముందుకు సాగాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగానే అర్బన్ సచివాలయ సిబ్బంది కోసం ఒక ప్రత్యేక 'వెల్ఫేర్ ఫండ్' (సంక్షేమ నిధి) ఏర్పాటు చేయాలని అందరూ కలిసికట్టుగా తీర్మానించారు. భవిష్యత్తులో సిబ్బందిలో ఎవరికి ఏ విధమైన ఆర్థిక లేదా ఇతర ఇబ్బందులు ఎదురైనా, ఈ నిధి ద్వారా తక్షణ సహాయం అందించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. రాబోయే రోజుల్లో ఉద్యోగుల సమస్యలపై అందరూ సంఘటితంగా ఉంటూ ఒకరికొకరు మద్దతుగా నిలవాలని ఈ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. అలాగే ఈ సంక్షేమ నిధి నిర్వహణ, భవిష్యత్తు కార్యాచరణపై అనుభవజ్ఞులైన పెద్దల నుంచి సలహాలు, సూచనలు తీసుకోవాలని సిబ్బంది నిర్ణయించారు. ఈ ఆత్మీయ సమావేశం గిద్దలూరు అర్బన్ సచివాలయ సిబ్బంది మధ్య ఐక్యతను చాటిచెప్పింది.

## నారాయణస్వామి ఆదివారం ఆదాయం రూ. 1,68,584/- లు



**సి ఎస్ పురం, సిటిజన్ టైమ్స్, ఆగష్టు 17:**

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణ స్వామి ఆలయమునకు ఆదివారం ఆదాయం రూ.1,68,584/- లు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిక్కెట్లు అమ్మకం ద్వారా జమ రూ. 85,560/- లు, లడ్డు ప్రసాదం అమ్మకం ద్వారా జమ రూ. 37,680/-, శాశ్వత అన్నదాన పథకం నకు ద్వారా విరాళములు రూ.21,696/-లు, పంచామృత అభిషేకమునకు రూ.11,032/- లు, స్వామివారికి శ్రీపాద కానుకలు వలన రూ.5,116/- లు, స్వామివారి ఉచిత ప్రసాదమునకు విరాళముల ద్వారా రూ.7,500/- లు వచ్చినట్లు తెలిపారు.

## పోలీసు 'మీకోసం'లో 68 ఫిర్యాదులు




**ఒంగోలు సిటిజన్ టైమ్స్, ఆగష్టు 17:**

సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ.. పోలీస్ అధికారులు ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం (మీకోసం) ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 68 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా ఎస్పీ కి వివరించి, సంబంధిత వ్రాతపూర్వక అర్జీలను అందించారు. ఫిర్యాదు దారులతో అధికారులు ముఖాముఖిగా మాట్లాడి, వారి సమస్యల పూర్తి వివరాలను, వారి ఫిర్యాదుల నేపథ్యాన్ని తెలుసుకొని, వాటిని చట్టపరంగా త్వరితగతిన పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. మీకోసం కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదుల విషయంలో ఎలాంటి అలసత్వం చూపకుండా, నిర్ణీత గడువులోనే పరిష్కారం అందించాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా సివిల్, భూ, ఆర్థిక తగాదాలు, చీటింగ్, అత్తరింటి వేదింపులు తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో సింగరాయకొండ సీఐ శ్రీహరి, కొండేపి సీఐ రమణయ్య, అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జున రావు, ప్యానెల్ అడ్వొకేట్ బి.బాలాజీ సింగ్, సమస్యల పరిష్కార వేదిక ఎస్సై యాస్మిన్, సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులకు క్షేత్రదర్శిని పత్తి, రైస్ మిల్లులో ప్రదర్శన





**గిద్దలూరు, సిటిజన్ టైమ్స్, ఆగష్టు 17:**

గిద్దలూరు సబ్ డివిజన్ పరిధిలోని గిద్దలూరు, రాచర్ల, కొమరోలు బెస్తవారిపేట మండలాలకి సంబందించిన రైతులను వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) ఆధ్వర్యంలో క్షేత్ర సందర్శనకి మురారి పత్తి జిన్నింగ్ మిల్లు, డిబిఎస్ రైస్ మిల్లు, జాతీయ విత్తనాభివృద్ధి సంస్థ నంద్యాల కి తీసుకొని వెళ్ళారు. అక్కడ పత్తి తీసేటప్పుడు వ్యర్థాలు పుల్లలు, పొగాకు చూర, ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా చూసుకోవాలని,కొంతమంది నీళ్లు చల్లి పత్తి అమ్మడం వలన ధర కూడా తక్కువగా ఉంటుంది అని కావున అధిక ధర పొందాలంటే ఇవి లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.జాతీయ విత్తనాభివృద్ధి సంస్థ అధికారి మోహన్ రాజు విత్తన ప్రాసెసింగ్ యూనిట్ లో విత్తనాలు శుభ్రం చేసి నాణ్యమైన విత్తనాలు తయారు చేయడం, పంట కోత అనంతరం విత్తనాలు నిల్వ,శనగలు, కందులు,జొన్న,కొర్రలు మొదలైనవి విత్తన ప్రాసెసింగ్ విధానం గురించి తెలిపారు. ఈ కార్యక్రమం లో సహాయ వ్యవసాయ సంచాలకులు గిద్దలూరు కె. రాజశ్రీ, మండల వ్యవసాయాదికారి గిద్దలూరు విజయ భాస్కర్ రెడ్డి, ఆత్మ సిబ్బంది వాణి, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

## ప్రముఖ వ్యాపారవేత నాయబ్ రసూల్ (బడే) కు ఏపీటీఎఫ్ నాయకుల సన్మానం

**సి ఎస్ పురం, సిటిజన్ టైమ్స్, ఆగష్టు 17:**

కోవిలంపాడులో ప్రముఖ వ్యాపారవేత్త షేక్ నాయబ్ రసూల్ (బడే )ను ఏపీటీఎఫ్ సి.ఎస్.పురం మండల శాఖ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పమాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ నాయబ్ రసూల్ సమాజానికి అందిస్తున్న సేవలను ఏపీటీఎఫ్ నాయకులు కొనియాడారు. రాబోయే రోజుల్లో కూడా సమాజ అభివృద్ధికి మరింతగా ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేపట్టి మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించాలని ఆకాంక్షించారు. సమాజసేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న సేవాభావులను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ నాయబ్ రసూల్, మండల శాఖ అధ్యక్షులు తోట శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి జె ఎస్ ఆనంద్ బాబు, నాయకులు ఇండ్ల ప్రసాద్, దండే శ్రీనివాసులు, డి. సుబ్బరాయుడు, ఎన్. గంగాధర్, గాంధీ, చాంద్ బాషా, ఏ సాయి, జి



సురేష్, గాలి రవీంద్ర, మధుబాబు, బి శ్రీనివాసులు, జి పుల్లయ్య, ఖాజా



రహంతుల్లా, ఎన్.వి. నారాయణ, షబ్బీర్, బి విష్ణు నారాయణ, సి ఆర్ పి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# అధైర్య పడొద్దు...!

## కండరాల పెరుగుదల వ్యాధి బాలుని కుటుంబానికి కలెక్టర్ రాజాబాబు భరోసా



**ఒంగోలు, సిటిజన్ టైమ్స్, ఆగష్టు 17:**

అరుదైన కండరాల అసాధారణ పెరుగుదల వ్యాధితో బాధపడుతూ నడవలేని స్థితిలో వీల్ చైర్ కు పరిమితమైన ఆ బాలుడిని చూసి జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు చలించిపోయారు. బాలుని పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి అవసరమైన సహాయం అందేలా చూస్తామని భరోసా ఇచ్చారు. సంతమాగులూరు మండలం కొప్పెరం గ్రామం నుంచి సహాయం కోసం సోమవారం కలెక్టరేట్లో ' మీకోసం ' కార్యక్రమానికి వచ్చిన ఆ బాలుని పేరు వల్లెపు పవన్ కిషోర్. వయస్సు 11 సంవత్సరాలు. ఆరేళ్ల వయసులోనే ఈ అరుదైన వ్యాధి బారిన పడినట్లు తల్లిదండ్రులు తెలిపారు. అసాధారణ స్థాయిలో వయసుకు మించి కండరాలు పెరుగుతున్నాయని, ఫలితంగా తన పని తాను చేసుకోలేని స్థితిలో ఉన్నాడని, తన బిడ్డ ఆరోగ్యాన్ని సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు అవసరమైన సహాయం చేయాలని బాలుని తల్లిదండ్రులు వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి కలెక్టర్ ను కోరారు. తమ స్థాయికి మించి ఇప్పటికే రూ.7 లక్షలను వైద్యం కోసం ఖర్చు చేసామన్నారు. దీనితో బాలుని ఆరోగ్య పరిస్థితిపై డిఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు ద్వారా కలెక్టర్ వివరాలు తెలుసుకున్నారు. జన్యులోపం వలన ఈ పరిస్థితి వచ్చిందని, నయం చేసేందుకు రూ.26 కోట్ల ఖరీదైన ఇంజక్షన్ చేయాల్సి ఉంటుందన్నారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ బాలుని పరిస్థితిని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా వెల్లూరులోని క్రిస్టియన్ మెడికల్ కాలేజీలో కూడా ఫిజియోతెరపి చేయించేలా చూడాలని చెప్పారు. ప్రభుత్వం తరపున అవసరమైన సహాయం చేసేలా చూస్తామని బాలుని తల్లిదండ్రులకు కలెక్టర్ భరోసా ఇచ్చారు.

## జర్నలిస్టుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

**పుల్లల చెరువు, సిటిజన్ టైమ్స్, ఆగష్టు 17:**

రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి, వారి సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) సంఘ సభ్యులు కోరారు.జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, రక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు.ఏపీయూడబ్ల్యూజే యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం పుల్లలచెరువు జర్నలిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పుల్లలచెరువు జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షుడు ఆరేవుల యేసోబు ఆధ్వర్యంలో జర్నలిస్టుల బృందం తహసీల్దార్ మల్లిఖార్జున్ నాయుడును కలిసి వినతిపత్రం అందజేసింది.ఈ సందర్భంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు.ముఖ్యంగా రాష్ట్రంలో జర్నలిస్టులు మరియు వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య సేవలు అందేలా నూతన ఆరోగ్య విధానాన్ని అమలు చేయాలని కోరారు.అదేవిధంగా అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు మంజూరు చేయడం, హెల్త్ కార్డుల సమస్యను పరిష్కరించడం, విధి నిర్వహణలో జర్నలిస్టులకు రక్షణ కల్పించేందుకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావడం, వృత్తి నుంచి విరమించిన జర్నలిస్టులకు గౌరవప్రదమైన జీవనం సాగించేందుకు పెన్షన్ పథకాన్ని అమలు చేయడం వంటి అంశాలను వినతిపత్రంలో ప్రస్తావించారు.ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ నిత్యం ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్న జర్నలిస్టుల సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించరాదని ఈ సందర్భంగా యూనియన్ నాయకులు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న



జర్నలిస్టులు ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఏపీయూడబ్ల్యూజే యూనియన్ 70 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర, జిల్లా శాఖల పిలుపు మేరకు జర్నలిస్టుల ప్రధాన డిమాండ్ల పరిష్కారం కోసం ప్రభుత్వానికి వినతిపత్రాలు సమర్పిస్తున్నట్లు నాయకులు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన భద్రత, విధి నిర్వహణలో ఎదురయ్యే సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు.వినతిపత్రాన్ని స్వీకరించిన తహసీల్దార్ మల్లికార్జున నాయుడు జర్నలిస్టుల సమస్యలను పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు యూనియన్ నాయకులు తెలిపారు.జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని మండల గౌరవ అధ్యక్షుడు గురునాధం తెలిపారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం యూనియన్ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో వెంకోబ్రావు,గురునాధం, నాగేంద్ర బాబు, మరియదాసు,యర్రగురవయ్య,జర్నలిస్టులు పాల్గొన్నారు.

## వెలుగొండ బాధితులకు పునరావాసం...

# ఉపాధి అవకాశాలు కల్పించాలి

### వైసీపీ నేత సయ్యద్ గౌస్ మోహిద్దీన్ డిమాండ్

**మార్కాపురం, సిటిజన్ టైమ్స్, ఆగష్టు 17:**

వెలిగొండ ప్రాజెక్టు కింద భూములు తమ ఆస్తులను కోల్పోయిన బాధితులకు పునరావాసం ఉపాధి అవకాశాలు వెంటనే కల్పించాలని వైసీపీ మైనార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ గౌస్ మోహిద్దీన్ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైసిపి హయాంలో 90 శాతం పూర్తి చేసుకున్న వెలుగొండ ప్రాజెక్టును మిగిలిన అరకురా పనులను పూర్తి చేసి తామే అంత చేశామని భుజాలు ఎగరేస్తున్న కూటమి సర్కార్ వెలుగొండ భూములు కోల్పోయిన బాధితులను విస్మరించడం సూచనీయమని అయన విమర్శించారు. ప్రాజెక్టు కింద ఆస్తులు కోల్పోయిన బాధితులను పట్టించుకోకుండా ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి ఉత్సాహం చూపుతున్న కూటమి సర్కార్ చిత్తశుద్ధి నష్టపోయిన వారిపట్ల ఎలా ఉందో అర్థమైపోతోందని అని అయన విమర్శించారు. కొందరు ఈ ప్రాజెక్టు కింద ఉపాధి కోల్పోగా కొందరు తమ ఆస్తులను నివాసాలను ఇలా అన్ని రకాలుగా నష్టపోయిన బాధితులు ఉన్నారని, వారందరికీ వారు నష్టపోయిన దానికి ప్రత్యామ్నాయం చూపి



పునరావాసం కల్పించాలని సయ్యద్ గౌస్ మోహిద్దీన్ డిమాండ్ చేశారు. వైసిపి హయాంలో పూర్తి చేసుకున్న వెలుగొండ ప్రాజెక్టును ప్రారంభించేందుకు ఉత్సాహం చూపుతున్న కూటమి సర్కార్ ముందుగా బాధితుల సమస్యలపై వారి పునరావసం ఉపాధి పై శ్రద్ధ పెడితే బాగుంటుందని ఆయన సూచించారు. బాధితులకు పునరావాసం ఉపాధి కల్పన చేయకుండా కేవలం ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి ఉత్సాహం చూపితే మాత్రం కూటమి సర్కార్ యొక్క కుటిల నీతి బహిర్గతమవుతుందని స్పష్టం చేశారు. వెలుగొండ ప్రాజెక్టు బాధితులను ఆదుకోకుండా కేవలం ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి పూనుకుంటే వైసిపి చూస్తూ ఊరుకోదని ఆయన హెచ్చరించారు. ప్రాజెక్టు బాధితులకు న్యాయం జరిగే వరకూ వారి పక్షాన పోరాడుతామని సయ్యద్ గౌస్ మోహిద్దీన్ స్పష్టం చేశారు. ఇప్పటికైన కూటమి ప్రభుత్వం వెలుగొండ భాధితులకు వేంటనే పునరావాసం కల్పించి వారికి నష్ట పరిహారం చెల్లించిన తరువాతే వెలుగొండ ప్రారంభోత్సవం పై దృష్టి పెట్టాలని కూటమి ప్రభుత్వంన్ని కోరారు.

## కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం..

### గిద్దలూరు కమిషనర్ రమణబాబుకు జర్నలిస్టుల శుభాకాంక్షలు



**గిద్దలూరు, సిటిజన్ టైమ్స్, ఆగష్టు 17:**

గిద్దలూరు పురపాలక సంఘం ఉత్తమ కమిషనర్గా ఎంపికై, ఆగస్టు 15న జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్న పురపాలక కమిషనర్ ఈ.వి. రమణబాబును సోమవారం పురపాలక కార్యాలయంలో స్థానిక జర్నలిస్టులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు . ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ.. పురపాలక సంఘ అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో కమిషనర్ రమణబాబు చేస్తున్న కృషిని అభినందించారు. ఉత్తమ కమిషనర్గా ప్రశంసా పత్రం అందుకోవడం గిద్దలూరు పురపాలక సంఘానికి గర్వకారణమని పేర్కొన్నారు.

## మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలని అసెంబ్లీ సమావేశంలో నిర్ణయం చేయాలి




**గిద్దలూరు, సిటిజన్ టైమ్స్, ఆగష్టు 17:**

గిద్దలూరు మున్సిపల్ ఆఫీస్ దగ్గర మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు మున్సిపల్ కార్యాలయం వద్ద తమ డిమాండ్ల కోసం సోమవారం మానవహారం తో నిరసన తెలియజేశారు ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు పి పాపయ్య మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీ ని అమలు చేయాలని ప్రభుత్వ అసెంబ్లీ సమావేశంలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని , సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని మున్సిపల్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని గతంలో ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం చేయని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కె శోభ, పి రవి, డి రంగయ్య, ప్రవీణ్, కన్నయ్య చెన్నమ్మ, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

## 19న జె.పి చెరువు శ్రీ నెమలిగుండ్ల రంగని ఆలయ భూముల కౌలుకు వేలంపాటలు

**గిద్దలూరు, సిటిజన్ టైమ్స్, ఆగష్టు 17:**

మార్కాపురం జిల్లా రాచర్ల మండలం జె.పి చెరువు శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి వారి ఆలయ భూముల కౌలుకు ఈ నెల 19న ఆలయ భూమి ఉన్న ఆయా గ్రామాల్లో బహిరంగ వేలంపాటలు నిర్వహిస్తున్నట్లు ధర్మకర్తల మండలి చైర్మన్ సిద్ధం నరసింహులు, ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం. నాగయ్య ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. 2026-27నుంచి 2028-29 వరకు మూడేళ్ల నిర్దిష్ట కాలపరిమితికి ఈ కౌలు పాట అమలులో ఉంటుంది. ఈ పాటలను ఉదయం 10 గంటలకు అనుములవీడు రామాలయంలో,10.30 కు పాలకవీడు,11కు రామాపురం 11.30కు సోమిదేవుపల్లె రామాలయాల్లో మధ్యాహ్నం 12.30 గంటలకు గిద్దలూరు మండలం అంబవరం రామాలయంలో,3 గంటలకు అర్ధవీడు మండలం రంగాపురం గ్రామాల్లోని రామాలయాల్లో వేలంపాటలు నిర్వహిస్తారు. ఆసక్తి ఉన్న రైతులు రెండు వేల రూపాయల ధరావత్తు చెల్లించి నేరుగా వేలం పాటలో పాల్గొనవచ్చు. హెచ్చుపాటదారు ఆ మొత్తాన్ని వెంటనే చెల్లించాల్సి ఉంటుంది.



# గంటల కొద్దీ జిమ్‌లో కష్టపడక్కర్లేదు! రోజూ ఇలా నడిస్తే చాలు!




నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టడం అందరికీ సవాలుగా మారింది. ముఖ్యంగా బరువు తగ్గాలని, పొట్ట చుట్టూ పేరుకుపోయిన కొవ్వును కరిగించాలని చాలామంది జిమ్‌లకు వెళ్లి గంటల కొద్దీ కష్టపడుతుంటారు. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టడం అందరికీ సవాలుగా మారింది. ముఖ్యంగా బరువు తగ్గాలని, పొట్ట చుట్టూ పేరుకుపోయిన కొవ్వును కరిగించాలని చాలామంది జిమ్‌లకు వెళ్లి గంటల కొద్దీ కష్టపడుతుంటారు. అయితే, ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా 'పిరమిడ్ వాకింగ్' అనే సరికొత్త ట్రెండ్ బాగా ప్రాచుర్యం పొందుతోంది. సాధారణ నడక కంటే ఎంతో ప్రభావవంతంగా పనిచేసే ఈ పద్ధతి ద్వారా తక్కువ సమయంలోనే అద్భుతమైన ఫలితాలను సాధించవచ్చని నిపుణులు చెబుతున్నారు. పిరమిడ్ వాకింగ్ అనేది ఒక రకమైన ఇంటర్వెల్ ట్రైనింగ్ వంటిది. ఇందులో నడక వేగాన్ని పిరమిడ్ ఆకారంలో క్రమక్రమంగా పెంచుతూ, మళ్ళీ తగ్గించడం జరుగుతుంది. ఉదాహరణకు, మొదట మూడు నిమిషాలు చాలా నెమ్మదిగా నడవాలి. ఆ తర్వాత మరో మూడు నిమిషాలు మధ్యస్థ వేగంతో, ఆ తదుపరి మూడు నిమిషాలు అత్యంత వేగంగా (బ్రిస్క్ వాకింగ్) నడవాలి. ఇలా వేగాన్ని పెంచిన తర్వాత, మళ్ళీ అదే క్రమంలో వేగాన్ని తగ్గిస్తూ రావాలి. అంటే వేగంగా ఉన్న నడకను మధ్యస్థానికి, ఆపై నెమ్మదిగా నడవడానికి మార్చాలి. ఇలా చేయడం వల్ల గుండె వేగం ఒకేలా కాకుండా మారుతూ ఉండటం వల్ల శరీరంలో జీవక్రియలు మెరుగుపడతాయి. ఈ పద్ధతి వల్ల కలిగే ప్రధాన లాభం ఏమిటంటే.. ఇది రక్త ప్రసరణను అద్భుతంగా మెరుగుపరుస్తుంది. శరీరంలోని ప్రతి భాగానికి ఆక్సిజన్ సరఫరా పెరగడం వల్ల కండరాలు బలోపేతం అవుతాయి. ముఖ్యంగా బెల్లీ ఫ్యాట్ అంటే పొట్ట దగ్గర ఉన్న మొండి కొవ్వును కరిగించడానికి ఈ నడక ఎంతో సహాయపడుతుంది. సాధారణ నడకలో మనం ఒకే వేగాన్ని పాటిస్తాం, దీనివల్ల శరీరం దానికి అలవాటు పడిపోతుంది. కానీ పిరమిడ్ వాకింగ్‌లో వేగం మారుతూ ఉండటం వల్ల శరీరం ఎక్కువ క్యాలరీలను ఖర్చు చేయాల్సి ఉంటుంది. దీనివల్ల బరువు తగ్గడం సులభతరమవుతుంది. డయాబెటిస్, రక్తపోటు వంటి సమస్యలతో బాధపడేవారికి కూడా ఈ పిరమిడ్ వాకింగ్ ఒక వరమనే చెప్పాలి. ఇది గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా, శరీరంలోని చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతుంది. మానసిక ఒత్తిడిని తగ్గించి, రోజంతా ఉత్సాహంగా ఉండేలా చేస్తుంది. దీనికోసం ప్రత్యేకమైన పరికరాలు లేదా జిమ్ సభ్యత్వాలు అవసరం లేదు. ప్రతిరోజూ ఉదయం లేదా సాయంత్రం మీ ఇంటి ఆవరణలో లేదా పార్కులో కేవలం 15 నుండి 20 నిమిషాల పాటు ఈ పద్ధతిని పాటిస్తే సరిపోతుంది. ఆరోగ్యంగా ఉండాలనుకునే వారికి ఇది ఒక సింపుల్ అండ్ బెస్ట్ ఛాయిస్.

## చలికాలంలో ఐస్ క్రీమ్ తింటే ఏమవుతుంది?

ఐస్ క్రీమ్ అంటే ఎవరికీ ఇష్టం ఉండదు. టైమ్‌తో సంబంధం లేకుండా చాలా మంది ఎప్పుడు పడితే అప్పుడు ఇష్టంగా తింటారు. చాలా మంది చలికాలంలో ఐస్ క్రీమ్ తింటుంటారు. అసలు చలికాలంలో ఐస్ క్రీం తింటే నిజంగా జలుబు చేస్తుందా? బయట చలి చంపేస్తున్నా.. ఐస్ క్రీం పార్లర్ల దగ్గర జనం తగ్గరు. కొందరికి ఐస్ క్రీం తినడానికి సీజన్‌తో సంబంధం ఉండదు. అయితే చలికాలంలో ఐస్ క్రీం తింటే జలుబు, దగ్గు వస్తుంది అని ఇంట్లో పెద్దలు హెచ్చరిస్తుంటారు. ఇంతకీ ఈ మాటలో నిజమెంత..? వింటర్‌లో చల్లని ఆహారాలు తీసుకోవడం ఆరోగ్యానికి హానికరమా..? నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఐస్ క్రీం తినడం వల్ల నేరుగా జలుబు రాదు. జలుబు, ఫ్లూ వంటివి వైరస్‌లు లేదా బ్యాక్టీరియా వల్ల వస్తాయి కానీ, చల్లని ఉష్ణోగ్రత వల్ల కాదు. చల్లని ఆహారం కడుపులోకి వెళ్లిన వెంటనే, మన శరీరంలోని అంతర్గత వ్యవస్థ దానిని వేడి చేయడానికి ప్రయత్నిస్తుంది. కాబట్టి శరీర ఉష్ణోగ్రత అకస్మాత్తుగా పడిపోదు. ఐస్ క్రీం ఒత్తిడిని తగ్గించి, మానసిక స్థితిని ఉల్లాసంగా ఉంచే ఆహారం. అందుకే చాలామంది చలిలో కూడా దీనిని ఇష్టపడతారు. ఆరోగ్యంగా ఉన్నవారు ఐస్ క్రీం తింటే పెద్దగా ఇబ్బంది లేకపోయినా కొన్ని సమస్యలు ఉన్నవారు మాత్రం దూరంగా ఉండటం మంచిది. గొంతు సమస్యలు: ఇప్పటికే గొంతు నొప్పి లేదా ఇన్‌ఫెక్షన్ ఉన్నవారికి చల్లని ఐస్ క్రీం ఆ అసౌకర్యాన్ని మరింత పెంచుతుంది. అస్తమా, దగ్గు ఉన్నవారు: శ్వాసకోశ సమస్యలు లేదా తరచుగా దగ్గు వచ్చే వారికి చల్లని, చక్కెర కలిగిన ఆహారాలు కఫం ఉత్పత్తిని పెంచే అవకాశం ఉంది. తేమ లేకపోవడం: చలికాలంలో గాలిలో తేమ తక్కువగా ఉంటుంది. ఐస్ క్రీం తినడం వల్ల గొంతు లోపలి భాగం మరింత పొడిబారి, వైరల్ ఇన్‌ఫెక్షన్లకు దారితీయవచ్చు. ఐస్ క్రీంను గబగబా తినకుండా, చిన్న స్పూన్లతో నిదానంగా తినండి. దీనివల్ల నోటి ఉష్ణోగ్రత అకస్మాత్తుగా తగ్గదు. ఐస్ క్రీం తిన్న తర్వాత గ్లాసు గోరువెచ్చని నీరు లేదా పాలు తాగడం వల్ల గొంతు సాధారణ స్థితికి వస్తుంది. మీకు కొంచెం జలుబుగా అనిపించినా ఆ సమయంలో ఐస్ క్రీంకు దూరంగా ఉండటమే ఉత్తమం. మొత్తానికి చలికాలంలో ఆరోగ్యంగా ఉన్నవారు ఐస్ క్రీం తినడం సురక్షితమే. అయితే అది మితంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. అతి సర్వత్ర వర్జయేత్ అన్నట్లు.. పరిమితి దాటితే ఏదైనా ప్రమాదమే.



## పళ్లు తోమితే చాలు అనుకుంటున్నారా!



పళ్ళు తోముకోవడం దంత ఆరోగ్యానికి అత్యవసరం. అమెరికన్ డెంటల్ అసోసియేషన్ సిఫార్సుల ప్రకారం, రోజుకు రెండుసార్లు, రెండు నిమిషాల పాటు బ్రష్ చేయడం వల్ల ఫ్లేక్ తొలగి, దంతక్షయం నివారించబడుతుంది. శుభ్రమైన, బలమైన, మెరిసే దంతాలు మీ వ్యక్తిత్వాన్ని మెరుగుపరుస్తాయి. సరైన సమయంలో, సరైన పద్ధతిలో బ్రష్ చేయడం ద్వారా దంత వ్యాధులను నివారించి, పూర్తి దంత సంరక్షణ పొందవచ్చు. పళ్ళు తోముకోవడం మన దైనందిన జీవితంలో ఒక ముఖ్యమైన భాగం. ఎందుకంటే, ఇది అనేక వ్యాధులను నివారించడంలో సహాయపడుతుంది. వాటిని శుభ్రంగా, బలంగా, మెరుస్తూ ఉంచుతుంది.. మెరిసే దంతాలు మన వ్యక్తిత్వానికి అందాన్ని ఇస్తాయి. అమెరికన్ డెంటల్ అసోసియేషన్ ప్రకారం, మనం రోజుకు రెండుసార్లు ఉదయం, పడుకునే ముందు రెండు నిమిషాలు పళ్ళు తోముకోవాలి. బ్రష్ చేయడం వల్ల దంతాలపై పేరుకుపోయిన ఫ్లేక్ తొలగిపోతుంది. ఫ్లేక్ దంతాల ఎనామిల్‌పై దాడి చేస్తుంది. ఇది చాలా కాలం పాటు జరిగితే, పంటి ఎనామిల్ దెబ్బతింటుంది. దీంతో కావిటీస్ ఏర్పడతాయి. అందుకే దంతాలు శుభ్రం చేసుకోవడం చాలా ముఖ్యం. ప్రతి ఒక్కరూ రోజుకు రెండుసార్లు ఉదయం ఒకసారి, రాత్రి పడుకునే ముందు ఒకసారి బ్రష్ చేయాలి. ఎందుకంటే ఇది రాత్రిపూట నోటిలో, దంతాలపై పేరుకుపోయిన ఫలకం, బ్యాక్టీరియాను శుభ్రపరచడంలో సహాయపడుతుంది. నోటి నుండి ఆహార కణాలను తొలగిస్తుంది. ఆరోగ్యకరమైన దంతాలు, చిగుళ్ళను నిర్వహిస్తుంది. ముందుగా మీ బ్రష్‌ను నీటితో తడపండి. ఫ్లోరైడ్ టూత్‌పేస్ట్‌ను ఉపయోగించండి. మీ దంతాలను 45 డిగ్రీల కోణంలో 2 నిమిషాల పాటు బ్రష్ చేయండి. మీ దంతాల ముందు, వెనుక, పైభాగాన్ని శుభ్రం చేయండి. మీ నాలుకను కూడా శుభ్రం చేసుకోండి. టూత్‌పేస్ట్‌ని ఉమ్మివేయండి. కానీ, రోజుకు రెండుసార్లు కంటే ఎక్కువ బ్రష్ చేయవద్దు. అంతేకాకుండా బ్రష్ కూడా హార్డ్‌గా ఉండకూడదు.

## 40 ఏళ్ల తర్వాత జుట్టు రాలుతుందా?



వయసు పెరిగేకొద్దీ పురుషులు, మహిళలకు జుట్టు రాలడం సర్వసాధారణం. ముఖ్యంగా 40 సంవత్సరాల తర్వాత మహిళలకు జుట్టు వేగంగా రాలడం పెరుగుతుంది. చాలా మంది ఈ సమస్యను నియంత్రించడం అసాధ్యంగా భావించి జుట్టు కోల్పోతుంటారు. మీ కుటుంబంలో ఎవరికైనా ఈ సమస్య ఎదురైందా? 40 సంవత్సరాల తర్వాత ఎందుకు. వయసు పెరిగేకొద్దీ పురుషులు, మహిళలకు జుట్టు రాలడం సర్వసాధారణం. ముఖ్యంగా 40 సంవత్సరాల తర్వాత మహిళలకు జుట్టు వేగంగా రాలడం పెరుగుతుంది. చాలా మంది ఈ సమస్యను నియంత్రించడం అసాధ్యంగా భావించి జుట్టు కోల్పోతుంటారు. మీ కుటుంబంలో ఎవరికైనా ఈ సమస్య ఎదురైందా? 40 సంవత్సరాల తర్వాత ఎందుకు జుట్టు రాలుతుంది? అనే విషయాల గురించి మీరెప్పుడైనా ఆలోచించారా? మాక్స్ హాస్పిటల్‌లోని డెర్మటాలజీ విభాగంకి చెందిన డాక్టర్ సౌమ్య సచ్‌దేవా దీని గురించి మాట్లాడుతూ.. 40 ఏళ్ల తర్వాత జుట్టు రాలడానికి అనేక కారణాలు ఉన్నాయి. కొంతమంది మహిళలు ఈ వయసులో మెనోపాజ్‌కు గురవుతారు. ఇది కూడా ఒక కారణం. అంతేకాకుండా అనేక హార్మోన్ల లోపాలు కూడా దీనికి కారణం కావచ్చు. మహిళలకు ఐరన్, విటమిన్ డి, బయోటిన్ లోపం ఉన్నా జుట్టు రాలడం సంభవించవచ్చు. మహిళల్లో జుట్టు రాలడానికి మానసిక ఒత్తిడి కూడా ఒక ప్రధాన కారణమని డాక్టర్ సౌమ్య అంటున్నారు. ఇటీవలి సంవత్సరాలలో మానసిక ఒత్తిడి వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. ఇవి జుట్టును కూడా ప్రభావితం చేస్తాయి. జుట్టు పెరుగుదలను అడ్డుకుంటాయి. జుట్టు రాలడానికి కారణమవుతాయి. కొన్ని సందర్భాల్లో, ఆటో ఇమ్యూన్ వ్యాధులు కూడా జుట్టు రాలడానికి కారణమవుతాయి. ఈ వ్యాధులకు చికిత్స లేదు. కొంతమంది మహిళల్లో థైరాయిడ్ లేదా డయాబెటిస్ వల్ల కూడా జుట్టు రాలడం సంభవించవచ్చు. ఇలాంటి సందర్భాలలో థైరాయిడ్, డయాబెటిస్‌ను నియంత్రించడం వల్ల కూడా జుట్టు రాలడాన్ని నియంత్రించవచ్చు. మహిళకు ఆటో ఇమ్యూన్ వ్యాధి లేదా జన్యుపరమైన కారణాల వల్ల జుట్టు రాలడం జరిగితే దానిని పూర్తిగా నియంత్రించడం కష్టం. ఇతర సందర్భాల్లో కొన్ని చిట్కాలను పాటించడం ద్వారా జుట్టు రాలడాన్ని నివారించవచ్చు. ప్రోటీన్, ఐరన్, విటమిన్లు అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి.జుట్టు పెరుగుదలకు పుట్టగొడుగులు వంటి విటమిన్ డి అధికంగా ఉండే ఆహారాన్ని తినాలి.నీళ్లు పుష్కలంగా తాగాలి. మానసిక ఒత్తిడిని నివారించాలి. దానిని నివారించడానికి ప్రతిరోజూ యోగా సాధన చేయాలి.మీ తలకు క్రమం తప్పకుండా మసాజ్ చేసుకోవాలి.

## నిద్రలేవగానే మానసిక గందరగోళం ఇలా ఎందుకు జరుగుతుంది?



పొద్దు పొద్దున్న బ్యాడ్ మూడ్‌తో నిద్రలేస్తున్నారా? ఏదో తెలియని నిరాశ, నిస్పృహ, మానసిక ఆందోళన, గందరగోళం వెంటాడుతున్నాయా?.. ఇలాంటి సమస్యకు కారణం మీరే కావచ్చునేమో ఒకసారి ఆలోచించండి. ఎందుకంటే.. ముందురోజు రాత్రి నిద్రకు ముందు మీరు తీసుకునే ఆహారం, పానీయాలు, అలాగే అతి ఆలోచనలు మరుసటిరోజు మిమ్మల్ని బ్యాడ్ మూడ్‌తో మేల్కొనేలా చేస్తాయంటున్నారు నిపుణులు. ఇటీవల అనేకమంది ఎదుర్కొంటున్న రొటీన్ ప్రాబ్లమ్ ఇది. నిద్ర మేల్కొన్నప్పటికీ ముఖంలో కోపం, ఆవేదన, స్ట్రెస్ వంటి ఏదో ఒక లక్షణం కనిపిస్తుంది. ఇలా అప్పుడప్పుడైతే పర్లేదు కానీ.. తరచూ అదే జరుగుతుంటే మాత్రం మీ ఆరోగ్యం పాడవుతుంది. అంతేకాకుండా రోజువారి పనికి, వృత్తి జీవితానికి ఆటంకం కలుగుతుంది. రాత్రి నిద్రకు ఉపక్రమించే ముందు సరైన భోజనం తీసుకోకపోవడం మరుసటి రోజు ఉదయం మీరు బ్యాడ్‌గా నిద్రమేల్కొనేలా చేస్తుంది. కొందరికి రాత్రి భోజనం తర్వాత స్వీట్లు, చిప్స్, ఇతర చిరుతిళ్లు తినే అలవాటు ఉంటుంది. ఇలా తినడాన్ని ఇంట్లో వాళ్లు వ్యతిరేకిస్తారనే కారణంతో కొందరు ఎలాగైనా తినాలని సాకులు వెతుకుతుంటారు. తాము తిని చాలా రోజులైందని, కాబట్టి ఇప్పుడు తింటే ఏం కాదని చెప్తుంటారు. కొందరు అలా తినడంవల్ల తమ బాధలు పోతాయని, రిలాక్స్ అవుతామని అంటుంటారు. కానీ ఇది నిజం కాదు. రాత్రిళ్లు భోజనం తర్వాత అదనంగా ఆహారం, స్వీట్లు, చిప్స్, పిస్తా, పిజ్జా వంటివి తీసుకో కూడదని నిపుణులు చెప్తున్నారు. ఎందుకంటే ఇవి అధిక మోతాదులో కార్బోహైడ్రేట్లు కలిగిన ఇతర ఆహారాలు. పడుకునే ముందు తినడంవల్ల నిండుగా ఉన్న అనుభూతిని కలిగిస్తాయి. కానీ మరుసటిరోజు మీ మూడ్ పాడు చేస్తాయి. కోపంతో మేల్కొనేలా చేస్తాయి. న్యూట్రిషనల్ థెరపిస్ట్ జాకీ లించ్ ప్రకారం.. ఇలాంటి ఆహారాలు మీ రక్తంలో షుగర్ లెవల్స్‌ను హెచ్చుతగ్గులకు గురిచేస్తాయి. ఫైనల్‌గా నిద్రపోయే విధానాన్ని ప్రభావితం చేస్తాయి. అందుకే నిద్ర పోయేకంటే ముందు కనీసం 3 నుంచి 4 గంటల ముందు తింటే అంత ప్రభావం ఉండకపోవచ్చు. మీరు బ్యాడ్ మూడ్‌లో మేల్కొన్నప్పుడు, ఆ కోపాన్ని మీ కడుపుపై చూపొద్దు. అంటే బ్రేక్ ఫాస్ట్ తీసుకోకుండా ఉండకండి. మీరు ఏ విధమైన ఆహారం తీసుకున్నా సరే.. బ్రేక్ ఫాస్ట్ అనేది చాలా ముఖ్యం. మూడ్ బాగోలేదని దానిని స్కిప్ చేస్తుంటే గనుక మీరు నిరాశ, ఆందోళనలను ఆహ్వానించినట్టే లెక్క. లైట్ అండ్ హెల్తీ బ్రేక్‌ఫాస్ట్ తక్షణమే మీ రోజువారి మానసిక స్థితిని ఆనందమయం చేస్తుంది. మీకు కోపంగా అనిపించినప్పుడు ఎందుకలా అనిపిస్తుందనేది నిర్ధారించుకోండి. కొంచెం అల్పాహారం తినండి, ఆ తర్వాత ఎలా అనిపిస్తుందో చూడండి. తినకుండా ఉండటం అనేది మరుసటిరోజు మీ మూడ్ పాడవడానికి కారణం అవుతుంది. ఉదయాన్నే బ్రేక్ ఫాస్ట్ చేసేందుకు ట్రై చేసినవారు ఆరోజంతా చాలా మంచి అనుభూతి చెందుతారు. బోనస్ చిట్కా ఏటంటే.. మీరు తీసుకునే బ్రేక్ ఫాస్ట్‌లో తగిన ప్రోటీన్‌ను కలిగి ఉండటం. ఎందుకంటే ఇది బరువు తగ్గడానికి, ఎనర్జీ కోసం సహాయపడుతుంది. మీరెప్పుడైనా నిద్రలేని రాత్రులు గడిపారా? ఎలాగైనా నిద్రపోవాలని ప్రయత్నంలో భాగంగా కళ్లు మూసుకుంటారు. కానీ కునుకు రాదు. రకరకాల ఆలోచనలు వెంటాడుతుంటాయి. అయితే ఎందుకు అలా జరుగుతుందో మాత్రం చాలామంది పట్టించుకోరు. మీరు మరుసటి రోజు బ్యాడ్ మూడ్‌తో నిద్ర మేల్కొనడానికి ఇది కూడా ఒక కారణమే అంటున్నారు నిపుణులు. పడుకునే ముందు రోటీన్‌కు భిన్నమైన జీవనశైలి, ఎక్కువసేపు స్క్రీన్ చూడటం, ఫోన్‌లో నిమగ్నమైపోవడం, జంక్ లేదా ఆయిలీ ఫుడ్స్ తినడం వంటి కారణాలతో ఇటువంటి సమస్య తలెత్తుతుంది. కాబట్టి వాటిని నివారించాలి. నిద్రపోయే సమయాన్ని ఆందోళన కరంగా ఉండకుండా చూసుకోవాలి. ప్రశాంతమైన వాతావరణం క్రియేట్ చేసుకోవాలి అంటున్నారు నిపుణులు.

## శీతాకాలంలో లభించే చవకైన పండు




పండ్లలో ఎన్నో పోషకాలు దాగున్నాయి.. వీటిని తింటే ఆరోగ్యంగా ఉండవచ్చు.. ముఖ్యంగా.. శీతాకాలంలో లభించే పండ్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని.. వీటిని డైలీ తినాలని సూచిస్తున్నారు ఆరోగ్య నిపుణులు.. అలాంటి పండ్లలో జామకాయ ఒకటి.. శీతాకాలంలో జామ పండు తినడం మంచిది.. పండ్లలో ఎన్నో పోషకాలు దాగున్నాయి.. వీటిని తింటే ఆరోగ్యంగా ఉండవచ్చు.. ముఖ్యంగా.. శీతాకాలంలో లభించే పండ్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి.. అలాంటి పండ్లలో జామకాయ ఒకటి.. శీతాకాలంలో జామ పండు తినడం మంచిది.. ఎందుకంటే ఇందులో ప్రోటీన్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. ఈ పండులో విటమిన్ సి, ఫైబర్ కూడా పుష్కలంగా ఉంటాయి. జామ పండులో అరటిపండు కంటే ఎక్కువ పొటాషియం, 5 గ్రాముల ఫైబర్, 3 గ్రాముల ప్రోటీన్ ఉంటాయి. ఈ పండు సాధారణంగా ప్రతిచోటా లభిస్తుంది.. అన్ని సీజన్లలో జామపండ్లు లభిస్తున్నప్పటికీ.. శీతాకాలంలో ఎక్కువగా లభిస్తాయి.. అంతేకాకుండా చౌకగా కూడా ఉంటాయి.. సాధారణంగా ఒక జామకాయ రూ.5 లేదా 10 కి లభిస్తుంది.. ఇంకా కేజీ రూ.50 వరకు లభిస్తాయి.. అయితే.. నాణ్యతను బట్టి కూడా ధర ఉంటుంది. శీతాకాలంలో అన్ని ప్రాంతాల్లో జామపండ్లు లభిస్తాయి. జామ పండు తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. ఇందులోని యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతాయి. జామ ఆకులు ఇన్సులిన్ నిరోధకతను మెరుగుపరుస్తాయి. జామ ఆకుల టీ తాగడం వల్ల మధుమేహ వ్యాధిగ్రస్తులలో భోజనం తర్వాత చక్కెర స్థాయిలు 10 శాతం తగ్గుతాయని నిపుణులు చెబుతున్నారు.ఇంకా జామపండ్లు గుండె ఆరోగ్యానికి తోడ్పడతాయి. యాంటీఆక్సిడెంట్లు గుండెను ఫ్రీ రాడికల్ నష్టం నుండి రక్షిస్తాయి.జామపండ్లు కొలెస్ట్రాల్, రక్తపోటును కూడా తగ్గిస్తాయి. వీటిలోని ఫైబర్ కంటెంట్.. బరువును తగ్గేలా చేస్తుంది.జామపండ్లు ముఖ్యంగా ఆరోగ్యకరమైన జీర్ణక్రియ, ప్రేగు కదలికలను ప్రోత్సహిస్తాయి. ఈ పండులోని ఫైబర్ మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. ఇంకా కడుపును ఆరోగ్యవంతంగా ఉంచుతుంది. జామపండును ఎలాగైనా తినొచ్చు.. అల్పాహారంగా లేదా భోజనం తర్వాత జామపండును తినవచ్చు.. ఇంకా స్నాక్స్ రూపంలో కూడా తీసుకోవచ్చు.. ఇంకా జ్యూస్ చేసుకుని కూడా తాగొచ్చు..

# సంక్రాంతి ఓకే.. మరి బోగి సంగతేంటి శర్వా?


'టాక్సిక్' మ్యూజిక్ లాంచ్ ఈవెంట్‌లో ఆకర్షణీయమైన పసుపు రంగు దుస్తుల్లో మెరిసిపోయిన రుక్మిణి వసంత్

శర్వానంద్ హీరోగా తెరకెక్కుతున్న 'భోగి'ని ఆగస్టు 28న విడుదల చేస్తామని గతంలో అధికారికంగా అనౌన్స్ చేశారు. అయితే రిలీజ్ సమయానికి కేవలం రెండు వారాలు మాత్రమే మిగిలి ఉండటంతో అసలు సినిమా చెప్పిన తేదీకి వస్తుందా లేదా అనే ప్రశ్నలు మొదలయ్యాయి. పాన్ ఇండియా స్థాయిలో ప్లాన్ చేసిన భారీ చిత్రానికి ఈ సమయానికి పబ్లిసిటీ ఓ రేంజ్ లా నడవాలి. కానీ మేకర్స్ నుంచి ఎలాంటి పెద్ద ప్రమోషనల్ అప్‌డేట్స్ సౌండ్ అయితే లేదు.దర్శకుడు సంపత్ నంది రీసెంట్ గా ఒక భారీ యాక్షన్ షెడ్యూల్ పూర్తి చేసుకున్నామని సోషల్ మీడియాలో పేర్కొన్నాడు. అయితే ఆ పోస్ట్‌లో రిలీజ్ డేట్ గురించి ఎలాంటి ప్రస్తావన తీసుకురాలేదు. ఇప్పటికే ఈ చిత్రం కోసం 800 మందికి పైగా జూనియర్ ఆర్టిస్టులతో ఏకంగా 22 రోజుల పాటు ఒక భారీ క్లైమాక్స్ యాక్షన్ ఎపిసోడ్‌ను పూర్తి చేశారు. ప్రొడక్షన్ పనులు చురుగ్గానే సాగుతున్నా, థియేటర్లలోకి రావాల్సిన తేదీ దగ్గర పడుతుండటంతో ఆడియన్స్‌లో మాత్రం సస్పెన్స్ కొనసాగుతోంది. 1960ల నాటి తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల నేపథ్యంలో సాగే ఈ పీరియడ్ యాక్షన్ డ్రామాలో శర్వానంద్ 'గంగా' అనే సరికొత్త రగ్గడ్ పాత్రలో కనిపించబోతున్నాడు. అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయతి ఇందులో హీరోయిన్లుగా నటిస్తున్నారు. తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా రిలీజ్ చేయాలనే ప్లాన్ ఉండటంతో సరైన బజ్ రావాల్సిన అవసరం కనిపిస్తోంది.ఇదిలా ఉంటే, శర్వానంద్ తన తర్వాతి ప్రాజెక్ట్‌ను మాత్రం చాలా వేగంగా లైన్‌లో పెట్టేశాడు. శ్రీను వైట్ల దర్శకత్వంలో రూపొందనున్న 'జార్జ్ క్రిష్' సినిమాను రీసెంట్‌గా ప్రారంభించారు. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది జనవరి 14న సంక్రాంతి పండుగ బరిలో నిలపబోతున్నట్లు ముందే పక్కాగా ప్రకటించారు. ఫెస్టివల్ సీజన్‌ను టార్గెట్ చేస్తూ రిలీజ్ డేట్ విషయంలో చిత్ర యూనిట్ చాలా ప్లానింగ్‌తో ఉంది.ఈ రెండు కథలు కూడా ఒకదానితో ఒకటి అస్సలు సంబంధం లేని పూర్తి భిన్నమైన జోనర్లు. ఒకవైపు యాక్షన్, రా లుక్‌తో సాగే పాన్ ఇండియా పీరియడ్ సినిమా చేస్తుంటే, వెంటనే మరోవైపు కుటుంబ ప్రేక్షకులను నవ్వించే పూర్తిస్థాయి కామెడీ ఎంటర్‌టైనర్‌ను సెట్ చేసుకున్నాడు. ఒక నటుడిగా ఇలాంటి వైవిధ్యమైన లైనప్ సెట్ చేసుకోవడం ఆయన కెరీర్‌కు మంచి ప్లస్ పాయింట్.అయితే వచ్చే ఏడాది సంక్రాంతి సినిమాకు పక్కా డేట్ ఉన్నప్పటికీ, ప్రస్తుతానికి చేతిలో ఉన్న 'భోగి' పరిస్థితిపైనే అందరి కళ్లు ఉన్నాయి. అధికారికంగా తేదీ మారలేదు కాబట్టి చెప్పిన సమయానికే వస్తుందా లేక కొత్త రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తారా అనేది చిత్ర యూనిట్ తేల్చాల్సి ఉంది. పండుగ రేసును ముందే లాక్ చేసుకున్న శర్వా, ఈ పీరియడ్ డ్రామాతో ఎప్పుడు బాక్సాఫీస్ వద్ద సందడి చేస్తాడో చూడాలి.





బాక్సింగ్ స్ఫూర్తితో సోనమ్ బాజ్వా బోల్డ్ లుక్

# గాలే టెస్టు: భారత బౌలర్ల ధాటికి లంక తడబాటు

**భారత్‌తో తొలి టెస్టులో కష్టాల్లో శ్రీలంక**

**మూడో రోజు ఆట ముగిసేసరికి 272/7 స్కోరు**

**కీలక ఇన్నింగ్స్ ఆడిన నిరోషన్ డిక్వెలా (80)**

**సెంచరీకి ఒక్క పరుగు దూరంలో సోనల్ దినూష (99 నాటౌట్)**

**భారత్‌కు ఇంకా 190 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం**



గాలే వేదికగా భారత్‌తో జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్‌లో శ్రీలంక కష్టాల్లో పడింది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆతిథ్య జట్టు తన తొలి ఇన్నింగ్స్‌లో 7 వికెట్ల నష్టానికి 272 పరుగులు చేసింది. యువ బ్యాటర్ సోనల్ దినూష (99 బ్యాటింగ్) సెంచరీకి కేవలం ఒక్క పరుగు దూరంలో అజేయంగా నిలిచాడు. భారత జట్టు కంటే శ్రీలంక ఇంకా 190 పరుగులు వెనుకబడి ఉంది. భారత జట్టు తొలి ఇన్నింగ్స్ లో 116.4 ఓవర్లలో 462 పరుగులకు ఆలౌట్ అయింది.భారత తొలి ఇన్నింగ్స్ స్కోరుకు సమాధానంగా బ్యాటింగ్ ప్రారంభించిన శ్రీలంకకు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మహమ్మద్ సిరాజ్ బౌలింగ్‌లో ఓపెనర్ నిషాన్ ఫెర్నాండో డకౌట్ కాగా, ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లు కూడా క్రీజులో నిలదొక్కుకోలేకపోయారు. దీంతో 90 పరుగులకే 5 కీలక వికెట్లు కోల్పోయి లంక పీకల్లోతు కష్టాల్లో పడింది.ఈ క్లిష్ట పరిస్థితుల్లో వికెట్ కీపర్ నిరోషన్ డిక్వెలా (80), సోనల్ దినూష కలిసి జట్టును ఆదుకున్నారు. వీరిద్దరూ ఆరో వికెట్‌కు 146 పరుగుల విలువైన భాగస్వామ్యాన్ని నెలకొల్పి భారత బౌలర్ల సహనానికి పరీక్ష పెట్టారు. 115 బంతుల్లో 7 ఫోర్లతో 80 పరుగులు చేసిన డిక్వెలాను ప్రసిధ్ కృష్ణ ఔట్ చేసి ఈ భాగస్వామ్యానికి తెరదించాడు.అయితే,ద

మరో ఎండ్‌లో సోనల్ దినూష ఓపిగ్గా ఆడుతూ భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నాడు. మూడో రోజు ఆట ముగిసే సమయానికి 163 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 99 పరుగులతో క్రీజులో ఉన్నాడు. ప్రస్తుతం అతనితో పాటు ప్రభాత్ జయసూర్య (9 నాటౌట్) బ్యాటింగ్ చేస్తున్నాడు. భారత బౌలర్లలో రవీంద్ర జడేజా, మానవ్ సుతార్ చెరో రెండు వికెట్లు తీయగా, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్ తలా ఒక వికెట్ పడగొట్టారు. నాలుగో రోజు ఆటలో దినూష సెంచరీ పూర్తి చేసుకుని, లోయర్ ఆర్డర్‌తో కలిసి ఆధిక్యాన్ని ఎంతవరకు తగ్గిస్తాడనేది ఆసక్తికరంగా మారింది.

# హార్దిక్ ఏ జట్టులోకి వెళ్తాడో బీసీసీఐనే డిసైడ్ చేయాలా?.. ఫుల్ పవర్ ఇవ్వాలంటూ డిమాండ్!

ఐపీఎల్‌లో రోజు రోజుకూ ఊపందుకుంటున్న ప్లేయర్ ట్రేడింగ్ వ్యవహారాలు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ముంబై ఇండియన్స్‌ను వీడి మరో జట్టులోకి వెళ్తాడనే వార్తలు జోరుగా ప్రచారంలో ఉన్న వేళ, టీమిండియా దిగ్గజ ఆటగాడు సునీల్ గావస్కర్ బీసీసీఐ జోక్యంపై తీవ్రంగా మండిపడ్డాడు. హార్దిక్ ఏ జట్టులోకి వెళ్తున్నాడు ఎంతకు ట్రేడింగ్ జరుగుతోంది? అనే విషయాలు కేవలం రెండు ఫ్రాంచైజీలు, ఆ ప్లేయర్, బీసీసీఐకి మాత్రమే తెలియకుండా.. బోర్డే పూర్తి పవర్స్ తీసుకుని పారదర్శకమైన ఆర్థిక లావాదేవీలను పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని సన్నీ స్పష్టం చేశారు. మిడ్-డే పత్రికలోని తన తాజా కాలమ్‌లో సునీల్ గావస్కర్ ఐపీఎల్ ట్రేడింగ్ విధానంపై తీవ్ర విమర్శలు చేశారు. ట్రేడింగ్ విండో సమయంలో ఒక ఫ్రాంచైజీ నుంచి మరో ఫ్రాంచైజీకి ఆటగాళ్లు మారినప్పుడు దానికి సంబంధించిన నగదు లావాదేవీలు, డీల్ రూల్స్ రహస్యంగా ఎందుకు ఉంచుతున్నారని బీసీసీఐని ప్రశ్నించారు. ఈ డీల్ వివరాలు కేవలం బీసీసీఐ, ప్లేయర్, సంబంధిత ఫ్రాంచైజీల దగ్గర మాత్రమే ఉండటంతో మిగిలిన జట్లకు ఎలాంటి సమాచారం ఉండటం లేదని, ఇది ప్రపంచంలోనే అతి పెద్ద లీగ్ అయిన ఐపీఎల్ పారదర్శకతను దెబ్బతీస్తుందని అభిప్రాయపడ్డారు.


**ఐపీఎల్ లో పారదర్శకతే ఏకైక మార్గం:**
ఐపీఎల్‌లో ప్రతి ఫ్రాంచైజీ తమ జట్టును నిర్మించుకోవడానికి ఒక శాలరీ క్యాప్ (పరిమితి) ఉంటుంది. అయితే ట్రేడింగ్ సమయంలో బదిలీ అయ్యే కోట్ల రూపాయల వివరాలు బయటకు రాకపోవడంతో ఏ జట్టు కూడా శాలరీ క్యాప్ నిబంధనలను దాటలేదని ఇతర ఫ్రాంచైజీలు నిర్ధారించుకోలేకపోతున్నాయని సునీల్ గావస్కర్ ఆందోళన వ్యక్తం చేశారు. లీగ్‌పై అనవసర విమర్శలు రాకుండా ఉండాలంటే బీసీసీఐ నేరుగా నిబంధనలను కఠినతరం చేసి, ట్రేడింగ్ జరిగే అన్ని ఆర్థిక లావాదేవీలని బహిర్గతం చేసేలా పర్యవేక్షించాలని సూచించారు.




**కెప్టెన్సీ ఇస్తేనే ట్రేడింగ్.. హార్దిక్ కీలక షరతు:**
2024లో గుజరాత్ టైటాన్స్ నుంచి ముంబై ఇండియన్స్‌కు మారిన హార్దిక్ పాండ్యా.. అక్కడ ఆశించిన స్థాయిలో రాణించలేకపోవడం, డ్రెస్సింగ్ రూమ్ వివాదాలు, అభిమానుల వ్యతిరేకత కారణంగా ముంబైని వీడాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఐపీఎల్ 2027 కంటే ముందే ముంబైని వదిలి కోల్‌కతా నైట్ రైడర్స్ , చెన్నై సూపర్ కింగ్స్ లేదా గుజరాత్ టైటాన్స్ వైపు వెళ్లేందుకు తీవ్రంగా యత్నిస్తున్నాడు పాండ్యా. ఏ జట్టులోకి వెళ్లినా తనకు కెప్టెన్సీ ఇవ్వాలనే ఏకైక షరతుతో హార్దిక్ ట్రేడింగ్ చర్చలు జరుపుతుండటం ప్రస్తుతం క్రికెట్ ప్రపంచంలో హాట్ టాపిక్ గా మారింది.

## ధోనీకి నో ఛాన్స్?: కెప్టెన్‌గా అదుర్స్, కోచ్‌గా మాత్రం వద్దు.. చెన్నై సూపర్ కింగ్స్ జ హెడ్ కోచ్‌గా అతడే బెస్ట్

చెన్నై సూపర్ కింగ్స్ జట్టు గత 18 సీజన్లుగా తమ హెడ్ కోచ్‌గా వ్యవహరించిన స్టీఫెన్ ఫ్లెమింగ్‌తో విడిపోయిన తర్వాత కొత్త కోచ్ వేటను వేగవంతం చేసింది. ఈ క్రమంలో ఇంగ్లాండ్ 2019 వరల్డ్ కప్ విన్నింగ్ కెప్టెన్ ఇయాన్ మోర్గాన్ సీఎస్‌కే నయా కోచ్‌గా వచ్చే అవకాశం ఉందంటూ భారత స్టార్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. మోర్గాన్ పేరు ఫ్రాంచైజీ వర్గాల్లో బలంగా వినిపిస్తోందని, దీనిపై ప్రాథమిక చర్చలు కూడా జరుగుతున్నాయని అశ్విన్ వెల్లడించాడు.



**మైఖేల్ హస్సీయే పర్ఫెక్ట్ ఛాయిస్:**
బయట నుంచి ఎవరినో తీసుకురావాల్సిన అవసరం చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు లేదని, ప్రస్తుతం జట్టు బ్యాటింగ్ కోచ్‌గా ఉన్న మిస్టర్ క్రికెట్ మైఖేల్ హస్సీనే ఆటోమేటిక్‌గా హెడ్ కోచ్‌గా నియమించాలని శ్రీకాంత్ సూచించారు. హస్సీకి సీఎస్‌కే సంస్కృతిపై సంపూర్ణ అవగాహన ఉందని, జట్టును నడిపించేందుకు అతడే అత్యుత్తమ ఎంపిక అని పేర్కొన్నారు. కేకేఆర్‌ను 2021లో ఫైనల్‌కు తీసుకెళ్లిన అనుభవం మెక్‌కలమ్‌కు ఉన్నప్పటికీ, ఆయన శైలి సీఎస్‌కేకు సరిపోదని అభిప్రాయపడ్డారు.

**మోర్గాన్, మెక్‌కలమ్ వద్దే వద్దు: శ్రీకాంత్**
రవింద్రన్ అశ్విన్ ప్రతిపాదనను భారత జట్టు మాజీ ఓపెనర్ కృష్ణమాచారి శ్రీకాంత్ తీవ్రంగా ఖండించారు. తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడిన ఆయన.. ఇయాన్ మోర్గాన్‌ను కానీ, బ్రెండన్ మెక్‌కలమ్‌ను కానీ సీఎస్‌కే హెడ్ కోచ్‌గా అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. మోర్గాన్ ఇంగ్లాండ్‌కు మంచి కెప్టెనే కావచ్చు కానీ, ఐపీఎల్‌లో కేకేఆర్ కెప్టెన్‌గా గొప్పగా ఏమీ సాధించలేదని, అతడు కా కామెంట్రీకే పరిమితమైతే బెటర్ అని శ్రీకాంత్ ఎద్దేవా చేశారు.

**ముందు ఎంఎస్ ధోనీ రోల్ తేలాలి:**
కొత్త కోచ్ నియామకానికంటే ముందు చెన్నై జట్టులో ది గ్రేట్ మిస్టర్ కూల్ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ భవిష్యత్తు ఏంటి అనేది తేలాలని మాజీ క్రికెటర్ శ్రీకాంత్ వ్యాఖ్యానించారు. రాబోయే రోజుల్లో ధోనీ పాత్ర ఏంటి? అతడు ఏ హోదాలో ఉంటాడు? అనే విషయంపై ముందుగా స్పష్టత రావాలని చెప్పారు. ధోనీ రోల్‌పై క్లారిటీ వచ్చిన తర్వాతే కొత్త హెడ్ కోచ్ నియామకం, జట్టు భవిష్యత్తు ప్రణాళికలు ముందుకు కొనసాగుతాయని క్రిష్ స్పష్టం చేశారు.

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776